# కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు పోవాలి



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 27(వుదయం జిల్లా ప్రతినిధి):**

తెలంగాణ కార్మికులు ముఖ్యంగా సింగరేణి బొగ్గు గని కార్మికుల సంక్షేమం కోసం గతంలో కేసీఆర్ నాయకత్వంలో అనేక కీలక నిర్ణయాలు, ప్రయోగాలతో ఎంతో మంది కార్మికులకు మేలు జరిగిందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు.ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సింగరేణి కార్మికులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థను పరిరక్షించడంతో పాటు కార్మికుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణి భవిష్యత్తు బాగుండాలంటే కార్మికుల సమస్యలను బలంగా ప్రశ్నించే గుర్తింపు పొందిన కార్మిక సంఘం అవసరమని పేర్కొన్నారు.గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరైంది కాదని అన్నారు. ఎన్నికల నిర్వహణపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్మికుల సమస్యలపై పోరాడేందుకు టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులను సమీకరించి, వారి సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా ఉందని పేర్కొన్నారు. గత నెలల్లో మూడు సింగరేణి గనులలో కార్మికులను కలిసిన సందర్భాల్లో వారు తమ సమస్యలను వివరిస్తూ, కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి మరియు కార్మిక సంక్షేమం కోసం జరిగిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు.సింగరేణి సంస్థ బలోపేతం కావాలి, కార్మికుల హక్కులు కాపాడబడాలి, కార్మికుల భవిష్యత్తుకు భద్రత కల్పించాలి అనే లక్ష్యంతో టీబీజీకేఎస్ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్మికులతోపాటు బిఆరెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌లో మెగా రక్తదాన శిబిరం

**పరకాల, సెప్టెంబర్ 27 (వు దయం ప్రతినిధి):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాల సేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నం వేణు ఆధ్వర్యంలో పరకాల మున్సిపల్ కార్యాలయం ఎదుట రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, డా. సిరంగి సంతోష్ కుమార్, డా. విజయ్ చంద్ర రెడ్డి తదితరులు హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ. రక్తదానం అత్యున్నత మానవతా సేవ అని అన్నారు. ఒక యూనిట్ రక్తదానం ఆపదలో ఉన్న ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు.



సేవా భావంతో రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు కృతజ్ఞతలు తెలిపారు. "రక్తదానం-ప్రాణదానం" అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి రక్తం అందించే సేవా సంకల్పాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పీ. జయంత్ లాల్, దేవునూరి మేఘనాథ్, ఎర్ర రామన్న, గురిజాల శ్రీరామ్ రెడ్డి, పరకాల రూరల్ అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్, దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, రాదారపు రతన్ కుమార్, సంగ పురుషోత్తం, గండు ముకేష్, కొలనుపాక సిద్ధు, కక్కు రాజు, మాచబోయిన క్రాంతి, మంద మనోజ్, రాజశేఖర్, గోగుల రాజిరెడ్డి, హరికృష్ణ, కందుల రవి వర్మ, బాణాల శ్రీనివాస్, ఆకుల రాంబాబు, పి. రంతు కుమార్‌తో పాటు వివిధ మండలాల బీజేవైఎం నాయకులు, రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నేతలు



**మమునూరు విమానాశ్రయానికి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు ప్రతిపాదించాలి.**

నర్సంపులపేట,సెప్టెంబర్27 ఉదయం ప్రతినిధి. కొండ లక్ష్మణ్ బాపూజీ కి నివాళులర్పించిన పద్మశాలి సంఘం నాయకులు, మామునూర్ విమానాశ్రయానికి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలి. ఆదివారం మండల కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పద్మశాలి సంఘం నాయకులు అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటం,తెలంగాణ ఉద్యమ పోరాటంలో కీలకపాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించి వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ప్రతిపాదించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్,మండల అధ్యక్షుడు బత్తుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన బాపూజీకి సముచితమైన స్థానం కల్పించాలని కోరారు. అందులో భాగంగా వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయానికి ఆయన పేరును పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కొండబత్తిని రవికుమార్ పద్మశాలి సంఘం నేతలు మేకల యాకయ్య, కూరపాటి శ్రీనివాస్,పాము వెంకన్న,వెన్నం వెంకన్న,కస్తూరి వెంకన్న,పెండెం యాదగిరి, కుమార్,కొండబత్తిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్ణోత్సవ సభ

**ధర్మసాగర్ సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**

ఈరోజు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు మాంకాల యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో హనుమకొండ లోని ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో జరిగిన 50 సంవత్సరాల సభ బుద్ధుని మరియు అంబేద్కర్ చిత్రపటాలకు పూలు, పూలమాల వేసి అనంతరం సభ ప్రారంభించడం జరిగింది. ముఖ్య అతిథిగా సత్యశోధక్ సమాజ్ జాతీయ అధ్యక్షులు బి చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 50 సంవత్సరాల కార్యక్రమాన్ని కి హాజరైన యువత అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకొని సంఘంలో పనిచేస్తూ సమాజాన్ని చైతన్య పరచాలని, యువజన సంఘాలే ఈ దేశానికిపట్టుకొమ్మలని,అంబేద్కర్ నినాదమే దేశానికి రక్షణ అని, కావున యువత పెడ త్రోవలో నడవకుండా సన్మార్గంలో బుద్ధుడు, అంబేద్కర్ ,పూలే ఆశయాల కలుగునంగా నడుచుకోవాలని ఐక్యమత్యంతో ముందుకు సాగాలని సంఘ సభ్యత్వం తో ప్రారంభమై సామాజిక చైతన్య దిశగా అడుగు వేయాలని సూచించారు ,భారత రాజ్యాంగా నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పేరు మీద 1976 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంఘం 1033/77 నెంబర్ తో ఏర్పడి నేటికీ 50 సంవత్సరాలు స్వర్ణోత్సవ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది, ఇట్టి సుదీర్ఘ కాలంలో అనేకమంది సభ్యులు సంఘ నిర్మాణం కొరకు సంఘ భవిష్యత్ కొరకు కృషి చేయడం జరిగింది, సంఘంలో సేవ చేసి మరణించిన వారికి ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాం, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువకులు, యువజన సంఘాలు నిలవాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మధుపాక



ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన సహాయ కార్యదర్శి తప్పెట్ల వీరన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య, మహబూబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నీరుడు సామెల్, హనుమకొండ జిల్లా కోశాధికారి చాణిక్య, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కొమురయ్య, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన 21 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొన్న జిల్లా పోలీస్ సిబ్బంది

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి ):**

కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన 21 కిలోమీటర్ల మారథాన్‌లో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.సతీష్,పోలీస్ కానిస్టేబుళ్లు బి.రవి,ఎం. సాయి,వినేష్ పాల్గొన్నారు. క్రీడలు,శారీరక దారుఢ్యం మరియు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో జిల్లా పోలీస్ సిబ్బంది చురుకుగా పాల్గొనడం అభినందనీయమని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్



పేర్కొన్నారు.మారథాన్‌లో పాల్గొన్న ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి. సతీష్, పీసీలు బి. రవి, ఎం.సాయి(స్పెషల్ పార్టీ), వినేష్(స్పెషల్ పార్టీ), లను జిల్లా ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని శారీరక దారుఢ్యాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# పోలీసుల పటిష్ట బందోబస్తు.. ప్రశాంతంగా గణపతి నిమజ్జనాలు

**నిమజ్జన ప్రాంతంలో స్వయంగా పర్యవేక్షించిన ఎస్ఐ బి. ప్రవీణ్**

**పర్వతగిరి, సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ ఎస్ఐ బి. ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను భక్తులు నిమజ్జనం కోసం పోలుకమ్మ చెరువు వద్దకు తరలించారు. భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు తావులేకుండా ఎస్ఐ బి. ప్రవీణ్ నిమజ్జన ప్రాంతంలోనే ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.పోలీసు సిబ్బంది భక్తులకు పలు సూచనలు చేస్తూ



నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టారు. పోలీసుల సమన్వయం, పటిష్ట బందోబస్తు మధ్య గణపతి నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయి

# అసైన్డ్ భూములపై ప్రభుత్వ నిర్ణయానికి భూ రక్షణ సమితి హర్షం

**సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం..**

**రాయపర్తి సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):**

అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తెలంగాణ భూ రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు కందికట్ల రాజయ్య, అయిత సాంబయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని భూ రక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. అసైన్డ్ భూముల విషయంలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం



జరిగేలా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.భూములపై ఆధారపడి జీవిస్తున్న పేదలు, రైతులకు హక్కులు, భద్రత కల్పించే విధంగా చర్యలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు సామాన్యులకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆకాంక్షించారు.భూముల రికార్డుల్లో సమస్యలు, నిషేధిత జాబితా తదితర అంశాలను పారదర్శకంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ భూ రక్షణ సమితి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సొసైటీ చైర్మన్,డైరెక్టర్‌కు ఘన సన్మానం దళిత సంఘాలు

**తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందనలు**

**పర్వతగిరి , సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండలంలోని చౌటపల్లి నూతన సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన అత్తి కుమారస్వామి, పర్వతగిరి సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన ఆబర్ల రవిలను దళిత సంఘాలు, తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లు సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. రైతులు, పేదలు, దళిత వర్గాలకు సహకార సంఘాల ద్వారా



మరింత ప్రయోజనం చేకూరేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరకుడు రవీందర్, బీఆర్ఎస్ మాజీ రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల భాస్కర్, రోలకల్ ఉప సర్పంచ్ కందికట్ల స్కైలాబ్, కందికట్ల భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జూర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

**బెజ్జూర్ (వుదయం ప్రతినిధి) :**

బెజ్జూరు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ నేత స్వాతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు సామల తిరుపతి మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి లో 1915 సెప్టెంబర్ 27న జన్మించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీ వి తాం తం పోరాటం చేశారన్నారు.



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం జరిగిందన్నారు.

2012 సెప్టెంబర్ 21న హైదరాబాదులో మరణించడం జరిగిందని ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సామల తిరుపతి ,ప్రధాన కార్యదర్శి కనుకుట్ల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు కనుకుట్ల శ్రీనివాస్, పరుస గణేష్ ,పర్స రమేష్ , అవధూత ఓం ప్రకాష్ ,భోగ విలాస్ ,శ్రీరామ భాస్కర్, అభిమానులు జిల్లాల సుధాకర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ ,పేదం విట్టయ్య, బెణికి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె హరిత**

**ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి) :**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, గ్రంథాలయ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌తో పాటు పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పద్మశాలి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు . యువత కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



అనంతరం కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను స్మరించుకున్నారు.తెలంగాణ ప్రాంత అభివృద్ధి, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. నిరాడంబర జీవితం గడుపుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడిగా ఆయన సేవలను కొనియాడారు. యువత కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికారి నదీమ్,అధికారులు, వివిధ శాఖల అధికారులు పద్మశాలి కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కపల్లిలో చిల్డ్రన్ పార్క్, జిమ్ కు శంకుస్థాపన

**మొక్క నాటిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు.**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి ):**

ఎల్కపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలో చిల్డ్రన్ పార్క్ మరియు జిమ్ ఏర్పాటు చేసేందుకు ఆదివారం రోజు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేయనున్న ప్రదేశంలో ఎమ్మెల్యే మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు మరియు



పచ్చదనం పెంపునకు ప్రాధాన్యతనిచ్చారు. గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, చిన్నారులకు ఆటవిడుపు కోసం పార్క్, యువతకు వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భక్తు రాంచందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీ విజయ్ కుమార్, నాయకులు ఘనపురం నాగేష్, మండల బీజేపీ అధ్యక్షులు శ్రీ కుక్కుడి రాజేశ్వర్, గ్రామస్తులు మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చిల్డ్రన్ పార్క్, జిమ్ ఏర్పాటు మరియు మొక్క నాటే కార్యక్రమం చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ

**గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 27.**



తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బాపూజీ 111వ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో బండారి జనార్దన్ గౌడ్, గడ్డం కేశవమూర్తి, తిరునహరి శేషు, నరేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే చేయూత.. అనర్హులకు చెక్

**మద్దులపల్లిలో పెన్షన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ ఎంపీడీవో రవీంద్రనాథ్**

**మహాదేవపూర్ ,సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):**



మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల అర్హతలపై ఎంపీడీవో రవీంద్రనాథ్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో దరఖాస్తులపై సమగ్ర విచారణ నిర్వహించారు.దరఖాస్తుదారుల అర్హతలు, వివరాలను పరిశీలిస్తూ వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పెన్షన్ అర్హతల పరిశీలనలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ రవీంద్రనాథ్ తెలిపారు. గ్రామానికి సంబంధించి 15 మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సరిత గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి గ్రామ పంచాయతీ సిబ్బంది, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఆస్తి నష్టం

**సుమారు ఐదు లక్షలుగా అంచనా**

**మహదేవపూర్: సెప్టెంబర్ 27(వుదయం ప్రతినిధి)**



మండలంలోని సూరారం గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఆస్తినష్టం జరిగింది. వివరాల్లోకి వెళితే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు గంగారపు నగేష్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించిన గదిలో విలువైన వస్తువులు టివి, రిఫ్రిజిరేటర్, బెడ్లు, ఫ్యాన్లు మరియు కొన్ని వ్యవసాయ పరికరాలు పూర్తిగా ధగ్గం అయ్యాయి. వాటితో పాటు దుస్తులకు మంటలు వ్యాపించాయి. స్థానికులు స్పందించి నీళ్లతో ఆర్పివేసారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పినా, దగ్ధమైన వాటి విలువ అయిదు లక్షల వరకు ఉంటిందని భాధితుడు గంగారపు నగేష్ తెలిపారు. విలువైన వస్తువులు, పరికరాలు పూర్తిగా కాలి పోవడం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

# బాధిత కుటుంబాలకు సొసైటీ చైర్మన్ అనిల్‌రావు అండ

**పరామర్శించి ఆర్థిక సాయం అందజేత**

**పర్వతగిరి, సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి ):**



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు పర్వతగిరి మండలం కల్లేడ గ్రామంలోని బాధిత కుటుంబాలను పర్వతగిరి ప్యాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు పరామర్శించారు. గ్రామ సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్తో కలిసి బాధిత కుటుంబాలను కలుసుకుని వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు.బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని అనిల్‌రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి పట్టణ అధ్యక్షులు కుసం రామచంద్రు, ప్యాక్స్ డైరెక్టర్ నరెడ్ల సూరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాసాడి రాజేశ్వరరావు, వడ్లకొండ ప్రసాద్, కారుపోతుల శ్రీనివాస్, బాల్లే ఎర్రప్ప, అదొండ చేరాలు, గ్రామ పెద్దలు పోస్ట్ రాజు, చీనూరి నిరంజన్, దాడి రమేష్, సంతు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ పిఏసీఎస్.మనోజ్ గౌడ్

**పర్వతగిరి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి ):**



పస్రా-తాడ్వాయి మధ్య ఇటీవల జరిగిన బస్సు-బొలెరో వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పర్వతగిరి మండలం పెద్దతండాకు చెందిన సరోజ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎం. మనోజ్ గౌడ్ వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతదేహానికి సంబంధించిన పంచనామా తదితర ప్రక్రియలు సక్రమంగా పూర్తయ్యేలా అధికారులతో సమన్వయం చేస్తూ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లునవత్ పంతులు, పెద్దతండా సర్పంచ్ భూక్యా వీరన్న, ఉప సర్పంచ్ లునవత్ బొజ్య, మాజీ సర్పంచ్ భూక్యా రూపులనాయక్, లునవత్ గణేష్, ముఖ్య నాయకులు లునవత్ యాకుబ్, మంజు నాయక్, సోషల్ మీడియా నాయకులు లునవత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక లడ్డూకు రూ.99 వేల ధర

**పోటాపోటీగా సాగిన వేలం.. బానోతు రవి–విజయ దంపతుల సొంతం**

**పర్వతీరి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి ):**



పర్వతగిరి మండలం తూర్పుతండా ఏనుగల్లు, శ్రీ ఏకదంతాయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొనగా, బానోతు రవి-విజయ దంపతులు రూ.99 వేల ధరకు వినాయక లడ్డూను దక్కించుకున్నారు.కమిటీ అధ్యక్షుడు బాదావత్ వినోద్ కుమార్, ట్రెజరర్ బానోత్ సచిన్, సభ్యులు రమేష్, తరుణ్, వెంకటేష్, ప్రవీణ్, గుణశేఖర్, రాకేష్, గ్రామ సర్పంచ్ బానోత్ దశరథ్ తదితరుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని కమిటీ కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన భక్తులు, దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి**

**కామారెడ్డి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి పట్టణంలోని సి.ఎస్. చర్చి ఎదుట ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి స్వామి, బీసీ వెల్ఫేర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బహుజన సమాజ నేతలు కొత్తపల్లి మల్లయ్య, క్యాతం సిద్దిరాములు, బీసీ సంఘ నాయకులు శివరాములు, శంకర్, రాజయ్య, నీల నాగరాజు, శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు సిరిగాద లక్ష్మీ నర్సయ్య, పట్టణ అధ్యక్షులు సబ్బని కృష్ణహరి, స్వామి, రాజయ్య, డిబిసిడీవో నర్సయ్య, ఏబీసీడిఓ చక్రధర్, నరేష్, పవన్, సునీత, స్వామి, విజయశాంతి, కృష్ణ ప్రసాద్, శాంతయ్య, శ్రీకర్ తదితరులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు.



# సేవా స్ఫూర్తికి 'భారత విభూషణ్'

**డాక్టర్ మందా సురేఖకు పాండిచ్చేరిలో జాతీయ పురస్కారం***

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 27, (వుదయం ప్రతినిధి):**

విద్యారంగంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా పనిచేస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ మందా సురేఖ రెడ్డికి 'భారత విభూషణ్' అవార్డు లభించింది. పాండిచ్చేరిలో ఇంటర్నేషనల్ యునైటెడ్ నేషన్స్ పీస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు.వివిధ రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక, సామాజిక సేవ, జానపద తదితర రంగాల్లో సేవలందిస్తున్న సుమారు 70 మందికి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో డాక్టర్ సురేఖ రెడ్డిని 'భారత విభూషణ్'తో సత్కరించారు.

పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె విద్యార్థులకు ప్రేరణ, మోటివేషన్ తరగతులు నిర్వహిస్తూ చైతన్యం కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, కాలుష్య నివారణ, దేశవాళీ విత్తనాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్నారు.ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న ఆమెకు తాజాగా 'భారత విభూషణ్' అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. పురస్కారం అందించిన సంస్థ ప్రతినిధులకు, తనను సత్కరించిన పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇళ్ళ స్థలాలు

**ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి**
**కొత్త వారందరికీ ప్లాట్లు,**
**ఇందిరమ్మ ఇండ్లు,**
**ఇదివరకే మంజూరు అయిన వారికి ఇళ్ళ బిల్లులు**
**కాలనీల్లో మౌలిక సదుపాయాలు**

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 27(వుదయం)**



ఖేడ్ నియోజకవర్గంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తూ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయడం తోపాటు ఇదివరకు మంజూరు అయిన వారికి బిల్లులు అందేలా చూస్తానని ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేష మూడవ మహాసభలు, డివిజ నూతన కార్యవర్గ ఎన్నిక అనంతరం నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఆదివారం ఎమ్మెల్యేతో క్యాంపు కార్యాలయంలో సమావేశమై సమస్యలు వివరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గృహాలు నిర్మించుకున్న వారికి మున్సిపల్ అనుమతులు ఇప్పించడంతోపాటు ఇళ్ళ బిల్లులు మంజూరీ చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రాసెస్ ప్రారంభమయ్యిందన్నారు. ఇంకా స్థలాలు పొందని వారికి ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే స్థలాలు ఇప్పించడమే కాకుండా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేని పక్షంలో ప్రైవేటు స్థలాన్ని జర్నలిస్టులు కొనుగోలు చేసుకుంటే వారికి గృహాలను మంజూరు చేయించడమే కాకుండా జర్నలిస్టు కాలనీలో రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులు సమకూర్చే విధంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఆత్మ చైర్మ వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మదారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులందరిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

# పిచ్చిమొక్కలను తొలగించిన విద్యుత్ అధికారులు

**నిజాంపేట**



మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాన్ని పిచ్చిమొక్కలు చుట్టుముట్టడంతో పాటు, స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్న విషయంపై " వుదయం " దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు ఆదివారం స్తంభం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను లైన్మెన్ బైరి రమేష్ ఆధ్వర్యంలో తొలగించారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు విద్యుత్ అధికారులకు, ధన్యవాదాలు తెలిపారు.

# అక్టోబర్ 10, 2026 వరకు మహాలయపక్షం

**(పితృపక్షం) కొనసాగుతుంది.**
**ఈ పదిహేనురోజులు పూర్తిగా పితృదేవతల పూజలకు అంకితం చేయబడతాయి.....**
**ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్ద గౌని జిన్నారం శివకుమార్ గౌడ్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 27...**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెదగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ మహాలయ పక్షాలు బాధలపద బౌల పాడిన సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 10 వరకు మహాలయ పక్షం ( పితృపక్షం) కొనసాగుతుంది ఈ 15 రోజులు పూర్తిగా అంకితం చేయడం మహా పుణ్యమని వారిలా వివరించారు.పితృదోషం అంటే ఏమిటి?పూర్వీకులు చేసిన కొన్ని దోషాలవలన సంతతివారు కష్టాలు అనుభవిస్తారు.

జాతక చక్రంలో పితృదోషాలను గుర్తించవచ్చు.

ప్రధాన ఫలితాలు.!
ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు
స్త్రీలకు అకాల విధవత్వం
మానసిక సమస్యలు
సంతానంవల్ల కష్టాలు
పితృఋణం తీర్చడం ఎందుకు అవసరం?
ప్రతి మనిషి తన జీవితంలో పితృఋణం తీర్చాలి. దీనివలన:
పితరులు తృప్తి చెందుతారు!
వారికి ముక్తి లభిస్తుంది!
వంశస్థులు సుఖసంతోషాలతో జీవిస్తారు!
మహాలయ పక్షంలో చేయవలసినవి!
ప్రతిరోజూ తర్పణం, శ్రాద్ధం చేయాలి.
పితృతిథి తెలిసినవారు ఆరోజు శ్రాద్ధం చేయాలి.
తెలియనివారు మహాలయ అమావాస్య (సెప్టెంబర్ 21, 2025) నాడు తప్పనిసరిగా శ్రాద్ధం చేయాలి.
ఈరోజుల్లో శుభకార్యాలు చేయరాదు.

**శ్రాద్ధ ప్రాముఖ్యత!**
ఈకాలంలో సూర్యుడు కన్యారాశిలో ప్రవేశిస్తే పితరులు భూమికి వస్తారని పురాణాలు చెబుతున్నాయి.
మహాలయ అమావాస్యనాడు వారు సంతతిద్వారం దగ్గరే నిలబడి ఆశీర్వాదంకోసం ఎదురుచూస్తారు.
శ్రాద్ధం చేయకపోతే దీవెన బదులుగా శాపం లభిస్తుందని పేర్కొనబడింది.

**శ్రాద్ధం చేసే మార్గాలు!**
నువ్వులు, గూడమిశ్రిత అన్నం సమర్పించాలి.
అన్నదానం అక్షయఫలం ఇస్తుంది.
శాకాహారంతో చేసిన శ్రాద్ధం కూడా ఫలదాయకమే.
ఆర్థికంగా కుదరకపోతే గోవుకు గ్రాసం పెట్టినా,
లేదా కేవలం ఆకాశాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నా అది పితృదేవతలకు అర్పణమవుతుంది.

**శాస్త్రవాక్యం!**
మహాలయపక్షంలో శ్రద్ధతో చేసే అన్నదానం — అనంతకోటి యజ్ఞఫలం ఇస్తుంది.మఖ నక్షత్రంలో చేసిన శ్రాద్ధం అక్షయఫలం కలిగిస్తుంది.
మహాలయ పక్షం - పితృదేవతలను స్మరించే పవిత్రకాలం!
పితృకార్యాలు నిర్వర్తించి వంశ పరంపరను కాపాడుకుందాం అని తెలిపారు.

# గణనాథుని లడ్డు వేలంలో 50,116 రూ లకు దక్కించుకున్న ఉప్పు నిఖిల్



**వెల్దండ సెప్టెంబర్ 27 (వు దయం)**

కోటి వివరాలు మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మట్టి వినాయకుని నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా లడ్డు ప్రసాదాన్ని50,116 రూపాయలకు ఉప్పు నిఖిల్ ,51 వేలకు రేవల్లి మల్లేష్ దక్కించుకున్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరియు యూత్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి లడ్డు అందజేశారు ఉత్సవాలలో ఆర్ట్స్ ప్రొడక్షన్ ఈవెంట్ నిర్వాహకులు ఉప్పు సాయిరాం, ఉప్పు రాకేష్ ఏర్పాటుచేసిన లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకట గౌడ్, మాజీ ఎంపిటిసి చిందం కృష్ణయ్య, తోపాటు పలువురు నాయకులు మహిళలు భక్తులు పాల్గొన్నారు



# రుద్రారం చెరువులో గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు వెలికితీత

**దుబ్బాక/అక్బర్ పేట-భూంపల్లి, సెప్టెంబర్ 27, వుదయం :**

సిద్దిపేట జిల్లా అక్బర్ పేటభూంపల్లి మండలం రుద్రారం పెద్ద చెరువులో శనివారం వినాయక నిమజ్జనం సందర్భంగా గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలను గజ ఈతగాళ్లు ఆదివారం వెలికితీశారు. రుద్రారం గ్రామానికి చెందిన పార రమేష్ (35), కలాల్ నవీన్ (25) శనివారం వినాయక నిమజ్జనం అనంతరం చెరువులో స్నానం చేస్తూ గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం రాత్రి వరకు పోలీసులు, స్థానికుల సహాయంతో చెరువులో వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో ఆదివారం ఉదయం గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలింపు చేపట్టారు. గాలింపులో రమేష్, నవీన్ ల మృతదేహాలు బయటపడ్డాయి.ఇద్దరు యువకుల మృతితో రుద్రారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు దుబ్బాక ఆసుపత్రికి తరలించారు.

# బిజెపి కి తొత్తుగా సి ఈ సి



**ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి, డి సి సి అధ్యక్షులు పి. శేఖర్ రెడ్డి**

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 27(వుదయం)**

ఓటు హక్కు పరిరక్షణ కోసం —— ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంగారెడ్డి లో ర్యాలీ విజయవంతం చేయండి ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ**
ఓటర్ల జాబితాలో ఓట్ల గల్లంతుపై నిరసనగా సోమవారం సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సి ఈ సి) శ్రీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా సి ఈ సి పని చేస్తుందన్నారు.

**సోమవారం ర్యాలీ**
జగ్గారెడ్డి నివాసం, రాంనగర్ పాత బస్ స్టాండ్,
అంబేద్కర్ విగ్రహం వరకు ఉంటుందని తెలిపారు.ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పెద్ద సంఖ్యలో తరలివచ్చి

**ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సంగారెడ్డి జిల్లా డి సి సి అధ్యక్షులు పి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ**

మన ఓటు హక్కు కోసం మన గళాన్ని బలంగా వినిపిద్దాం!ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, షెవలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలికి ఉప సర్పంచ్ భవన గారి శ్రీనివాస్ చేయూత

**కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగురాలు గంట వరలక్ష్మి...**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 27....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన గంట అంజయ్య యాదమల్ల కుమార్తె వరలక్ష్మి (35) పుట్టుకతోనే శారీరక దివ్యంగురాలుగా బాధపడుతూ వస్తున్న విషయం తెలిసిందే. అంగవైకల్యురాలైన వరలక్ష్మి ఇప్పటివరకు ఎక్కడికి వెళ్ళినా ఇతరుల పైన ఆధార పడవలసిన పరిస్థితి. తనకు ఎదురవుతున్న సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొంతి ఉపసర్పంచ్ భవన గారి శ్రీనివాస్ ముదిరాజ్ దృష్టికి దివ్యాంగురాలు తీసుకువచ్చి మొరపెట్టుకుంది. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉపసర్పంచ్ భవన గారి శ్రీనివాస్ తనకు తెలిసిన దాతలు తడిసిన అమరేందర్ రెడ్డి 20,000. సంజయ్ రెడ్డి 5000 రూపాయలు. మల్లవరం మల్లారెడ్డి ఐదువేల రూపాయలు. ఉపసర్పంచ్ శ్రీనివాస్ 12, 500 రూపాయలు ఇచ్చి మొత్తం 42 వేల వ్యయం వెచ్చించి దివ్యంగురాలు వరలక్ష్మికి ఎలక్ట్రికల్ చార్జింగ్ సైకిల్ ను బహుకరించడం జరిగింది. తన సమస్యను వివరించిన వెంటనే ఉపసర్పంచ్ భవన్ గారి శ్రీ నివాస్ తో పాటు దాతలకు రుణపడి ఉంటారని వరలక్ష్మి మాట్లాడుతూ అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మోగడంపల్లి ఆనంద్ గుప్తా, చుక్క దయానంద్, మహేష్,శ్రావణ్, కొత్త నవీన్,సత్యనారాయణ, దశరథి రెడ్డి,, గోపాల్ తదితరులు ఉన్నారు.

# సంస్థాన్ ఘన చరిత్ర కు సాక్ష్యం



**(వుదయం ప్రతినిధి)పాపన్నపేట, సెప్టెంబర్: 27**

పురాతన చరిత్ర కల్గిన రాతి కట్టడాలను సంరక్షించుకోవాలని పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పాపన్నపేట లోని కుమ్మరి గైనీ వద్ద బురుజు ను ఎంపీడీఓ విష్ణువర్ధన్,గ్రామ ప్రజలతో కలిసి సందర్శించారు. రాయబాగిన్ రాణీ శంకరమ్మ పాలించిన ప్రాంతాన్ని ప్రభుత్వం,ప్రజల సహకారంతో సంరక్షిస్తే కట్టడాలు పదిలంగా ఉంటూ,భవిష్యత్ తరాలకు చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుందని వివరించారు. ఘణమైన గత చరిత్ర వైభవాన్ని గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారిణి హిమ చందన,బీట్ అధికారిణి శారద,పంచాయతీ కార్యదర్శి నయీమ్,పాపన్నపేట ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్,వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

# గణేష్ లడ్డూను రూ.26 వేలతో కొనుగోలు చేసిన యెర్రా బాగీ రాజు

**వుదయం మానూరు సెప్టెంబర్:27**

భుజరాన్‌పల్లి,గ్రామంలో శ్రీ,గజేంద్ర యువసేన,అసోసియేషన్ ఆధ్వర్యంలో ,నిర్వహించిన గణేష్ మండపం, వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు.
గ్రామంలోని, ఎస్సీ కాలనీలో ప్రతిష్ఠించిన,గణేష్ విగ్రహం, వద్ద గణేష్,నిమజ్జనం, సందర్భంగా గ్రామస్తుల,సమక్షంలో,నిర్వహించిన వేలంపాటలో,యెర్రా బాగీ రాజు రూ.26 వేలతో, గణేష్ లడ్డూను కొనుగోలు చేశారు.
అనంతరం, రాజు గణనాథుడిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, శ్రీ గజేంద్ర యువసేన అసోసియేషన్, సభ్యులు పాల్గొన్నారు



# విద్యుత్ షాక్ తో రైతు మృతి

**నర్సాపూర్ సెప్టెంబర్ 27 (వుదయం న్యూస్)**



విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నత్నాయిపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం(34) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన తమ్ముడు అనిల్ కుమార్, కౌలు రైతు అందూరి వీరేశంతో కలిసి ఆదివారం పొలానికి నీరు వేయడానికి వెళ్లారు. గొల్ల మల్లేశం బోరు మోటర్ వేయగా అది స్టార్ట్ కాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి వైర్ చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడ పడిపోయాడు. గమనించిన మిగతా ఇద్దరు బైక్ పై నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు

# గ్రామాలలో అక్షరమాల ఉల్లాస్ పరీక్ష నిర్వహణ



**ఊర్కొండ న్యూస్ 27 వుదయం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం మండలంలోని అన్ని గ్రామాలలో ఈ రోజు తేది 27/9/2026 నాడు ఊర్కొండ మండలం లో అన్ని గ్రామాలలో అమ్మ అక్షర మాల (ఉల్లాస్ ) పరీక్ష ఉదేశ్యం, గ్రామీణ ప్రాంతంలో నిరక్షరాస్యత నిర్మూలించి అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చెప్పడుతున్న కార్యక్రమల్లో భాగంగా ఆదివారం నాడు ఊర్కొండపేట పరీక్ష కేంద్రాని MPDO సత్యపాల్ రెడ్డి గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్ CC పోచయ్య, సందర్శించడం జరిగింది. ఈ పరీక్ష కేంద్రం లో గ్రామ సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ, Voa మాధవి, నిరక్షరాసులు పాల్గొనడం జరిగింది.మొత్తం మండలం టార్గెట్ సంఖ్య: 952, హాజరైనవారు: 669

# టేక్మాల్ మండల పిఆర్‌టియుటిఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షులుగా ఎండి అమిరుద్దీన్.**
**ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ సహదేవ్.**

**టేక్మాల్, సెప్టెంబర్ 27: (వుదయం ప్రతినిధి.)**





స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ టేక్మాల్ మండల శాఖ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. 202628 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ఎన్నికను ఏకగ్రీవంగా పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సమావేశానికి... పాపన్నపేట మండల శాఖ అధ్యక్షులు పంతులు రాజు, కౌడిపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి బాల కిషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.మండల కార్యవర్గంలోని 12 స్థానాలకు సరిపడా 12 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో అందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు.

అధ్యక్షులు: ఎండి. అమీరుద్దీన్ (ప్రధాన ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల, టేక్మాల్) నాల్గవసారి ఏకగ్రీవం.
ప్రధాన కార్యదర్శి: సిహెచ్. సహదేవ్ (ప్రధాన ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల, సాలోజిపల్లి). అసోసియేట్ అధ్యక్షులు ఎస్. శ్రీకాంత్ రెడ్డి.
మహిళా అసోసియేట్ అధ్యక్షులు ఎస్. ప్రియాంక.
ఉపాధ్యక్షులు: నాయకం శ్రీకాంత్, బి. అశోక్.
మహిళా ఉపాధ్యక్షులు: బి. శ్వేత, యం. రవళి.
కార్యదర్శులు: టి. నరేష్, ఎస్. శివ.
మహిళా కార్యదర్శులు ఏ. నాగరాణి, హర్ష ఫాతిమా. ఎన్నికయ్యారు.
ఈ ఎన్నికల్లో సుమారు 137 మంది ప్రాథమిక సభ్యులు పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు సుంకరి కృష్ణ,ప్రధాన కార్యదర్శి సామ్య, అలాగే మండల ఉపాధ్యాయులు బాల్య, వినోద్ కుమార్, ఆర్. రమేష్, కృష్ణ, ప్రశాంత్ తదితరులు ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, తమకు బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ సేవ చేయడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

**పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం పాలమూరు రైతుల కు శత్రువుగా మారాడు**
**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**రైతులతో కలిసి పంట పొలాల్లో పరిశీలించిన కేటీఆర్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 27 (వుదయం బ్యూరో):**



తెలంగాణలో నెలకొన్న పంటల ఎండుదల పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రంగా విమర్శించారు. అన్ని నీటి వనరులు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దాని ఫలితంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 50 శాతానికి పైగా పంటలు నష్టపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఆదివారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని తిరిగి నాగర్ కర్నూల్ వస్తుండగా దేశ ఇటిక్యాల గ్రామ శివారులో రైతులు కేటీఆర్ కాన్వాయ్ ను అడ్డుకుని తమ గోసను వెలిబుచ్చారు. నీళ్లు లేక తమ పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ స్వయంగా పొలాల్లోకి వెళ్లి ఎండిపోయిన పంటలను పరిశీలించారు.
ఈ సందర్భంగా రైతులు శేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, యాదమ్మ మాట్లాడుతూ, తమకు ఉన్నది రెండెకరాలేనని, అప్పులు చేసి రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టామని, కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే చూడలేకపోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఇంత నష్టం జరిగినా ఒక్క అధికారి కూడా పొలం గట్టునకు రాలేదని వాపోయారు.
అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎటు చూసినా 40 నుంచి 50 శాతం పంటలు ఎండిపోయిన పరిస్థితి నెలకొందని, పంటలు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. అటు గోదావరిలో, ఇటు కృష్ణాలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, ఈ సంవత్సరం కూడా 248 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సక్రమంగా వాడితే దాదాపు 25 లక్షల ఎకరాలు పండించుకునే అవకాశం ఉందని అన్నారు.
పాలమూరు బిడ్డ అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు పాలమూరు రైతాంగానికి ప్రథమ శత్రువుగా మారారని, నల్లమల్ల పులి అని చెప్పుకునే ముఖ్యమంత్రి ఈరోజు చంద్రబాబు నాయుడు చేతుల్లో పిల్లిలా మారారని ఎద్దేవా చేశారు.
ఏడాది ముందు నుంచే శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, వర్షాలు తక్కువగా కురుస్తాయని హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక చేయలేదని, కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను ఈరోజు వరకు నడపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగారంలో ఉల్లాస్ పరీక్షలు 7వ తరగతి పరీక్ష రాసిన మహిళలు

**అచ్చంపేట, సెప్టెంబరు 27 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని సింగారం గ్రామంలో ఆదివారం మహిళా సంఘం సభ్యులకు ఉల్లాస్ (ULLAS) 7వ తరగతి పరీక్షలను వీఓఏ నారోజు సరిత నిర్వహించారు.గతంలో 5వ తరగతి ఉత్తీర్ణులైన 40 మంది మహిళలు ఆదివారం నిర్వహించిన 7వ తరగతి పరీక్షకు హాజరై పరీక్ష రాశారు. యూపీఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ పరీక్షలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు సరిత మాట్లాడుతూ, నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు చదువు వైపు అడుగులు వేస్తున్నారని, ప్రతి మహిళ చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డులలో తప్పులు దొర్లడంపై రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదు

**మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బుర్ర మురళి గౌడ్....**



**వుదయం న్యూస్, శివ్వంపేట సెప్టెంబర్ 27...**

గ్రామాలలో పంపిణీ చేసిన రేషన్ స్మార్ట్ కార్డులలో తప్పులు దొర్లడం దీంట్లో భాగంగా సాంకేతిక లోపాలు( ప్రింటింగ్ తప్పులు) జరిగినప్పుడు సాధారణంగా వాటిని సరిదిద్దే ప్రక్రియ అధికార యంత్రం లేదా సంబంధిత శాఖ అధికారులు చూసుకుంటారని దీనిని అడ్డం పెట్టుకొని బి. ఆర్. ఎస్ బిజెపి పార్టీల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని మెదక్ జిల్లా శివ్వంపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళి గౌడ్, తీవ్రంగా మండిపడ్డారు.తాము గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో కాపాడుకుంటూ ముందుకు వెళుతుంటే బిఆర్ఎస్ బిజెపి పార్టీలు గ్రామాలలో అల్లరు లేపాలని ప్రయత్నిస్తున్నారని అటువంటి పద్ధతులు మానుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు.పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో రేషన్ కార్డులు మంజూరు చేయకుండా పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16 లక్షల 32వేల ఎనిమిది వందల పది రేషన్ కార్డులు కొత్తవారికి మంజూరు చేసిన విషయాన్ని బుర్ర మురళి గౌడ్ గుర్తు చేశారు స్మార్ట్ రేషన్ కార్డుల గురించి బిజెపి పార్టీల నాయకులు రేషన్ కార్డులలో పిన్కోడ్ సవరణ గురించి అధికారులకు చెప్పలేదని ప్రెస్ మీట్ లలో చెప్పడం సరి కాదని ఆయన అన్నారు ఈ విషయంపై తాము గ్రామపంచాయతీలో నుండి ముందుగానే శివంపేట తాసిల్దార్ కు సమాచారం అందించామని దీనిపై తాసిల్దార్ వెంటనే స్పందించి త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులు సవరణ చేస్తామని చెప్పిన విషయాన్ని సర్పంచి మురళి గౌడ్ తెలిపారు.

# వేల్పుగొండలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయం.**

**టేక్మాల్, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి.)**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ వేడుకల్లో స్థానిక చారిత్రక ప్రాధాన్యం గల శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక ప్రాధాన్యత లభించింది.సాంస్కృతిక శోభతో భారీ ఊరేగింపుప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని వేల్పుగొండ గ్రామంలో మహిళలు, మండల వెలుగు సంఘం సభ్యులు, అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో బతుకమ్మలు, బోనాలతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, డీజే పాటలు సాంస్కృతిక నృత్యాల నడుమ సాగిన ఈ ఊరేగింపు శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయం వరకు కోలాహలంగా కొనసాగింది.

ఆలయంలో ప్రధాన అర్చకులు అరుణ్ శర్మ, వేద బ్రాహ్మణ పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి పూలాభిషేకం, మహా రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులు, మహిళలు బతుకమ్మ ఆటలు ఆడుతూ, కోలాటాలతో నృత్య ప్రదర్శనలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

**చారిత్రక సంపదకు పూర్వవైభవం తెస్తాం**

ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ.. వేల్పుగొండలోని శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయ కట్టడాలు, కాకతీయుల కాలంనాటి చారిత్రాత్మిక విశేషాలను అధికారులకు వివరించారు. ఈ ప్రాంతం వారసత్వ ప్రాధాన్యతతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. చరిత్ర, సంస్కృతిపై పరిశోధనలు చేస్తూ మెతుకు సీమ వైభవాన్ని చాటుతున్న 'మెతుకు సీమ వైభవం' నిర్వాహకులు బుర్ర సంతోష్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ.. ఇంతటి పురాతన శిల్పకళా సంపద టేక్మాల్ మండలంలో ఉండడం మన అదృష్టమని, ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ వేడుకల్లో ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ నిరుడి దాసు, ఉప సర్పంచ్ ఎంపీ సుధాకర్, ఎంపీవో రియాజుద్దీన్, ఐసీడీఎస్ అల్లాదుర్గం ప్రాజెక్ట్ సూపర్వైజర్ పద్మలత, సెక్టార్ సూపర్వైజర్ నిహారిక, ఏపీఎం గోపాల్, ఏపీఓ పౌలు, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.వీరితో పాటు ధూప దీప నైవేద్య రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్ శర్మ, సభ్యులు గిరిధర్ శర్మ, సంతోష్ కుమార్ శర్మ, గ్రామ పెద్దలు అంగన్వాడి సిబ్బంది, వెలుగు సంఘం సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సనాతన ధర్మ విజ్ఞాన వేదిక

**మాతా పిత్ళ కర్మలు తప్పనిసరిగా చేయాలా?... మాతృదేవోభవ, పితృదేవోభవ,అని చెబుతున్నది ఆర్యవాణి....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 27....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు పెద్దగొని జిన్నారం శివకుమార్ గౌడ్ మాత పిత్ళ కర్మలు తప్పనిసరిగా చేయాలా జన్మనిచ్చిన వారి గురించి ఇలా వివరించారు.జన్మనిచ్చి, పోషించి, పెంచి, తప్పట అడుగులు దగ్గర నుండి, తప్పు అడుగుల వరకు, సరిదిద్ది, పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించి, మనల్ని, మనుషులుగా సమాజంలో నిలబెట్టిన తల్లిదండ్రులు మరణించిన తరువాత, శ్రాద్ధ కర్మలు తప్పనిసరిగా చేయాలా అంటే, ఏం చెప్పాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాల వారు, ప్రతి సంవత్సరము, తిథుల ప్రకారం సంవత్సరీకాలు పెడుతుంటారు. శూద్ర వర్ణం వారందరూ, ఎక్కువగా సంక్రాంతికి, పెద్దలను స్మరించి బట్టలు పెడుతూ ఉంటారు. పెద్దల పేరు మీద, దానధర్మాలు చేస్తుంటారు. ఇది మన సంప్రదాయం. సంక్రాంతికి పెద్దలను స్మరించుకుని పూజించుకోవడం ఎందుకంటే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించేది, పుష్యమాసంలో కాబట్టి. ఉత్తరాయన పుణ్యకాలం కూడా ఇప్పుడే ప్రారంభమవుతుంది. కనుక ఇప్పుడే స్వర్గద్వారాలు తెరుస్తారని, ఈ పుణ్యకాలంలో మరణించిన వారికి స్వర్గ ప్రాప్తి కలుగుతుందని హిందువుల విశ్వాసం. స్వర్గద్వారాలు తెరిచే సమయంలోనే సంక్రాంతి వస్తుంది. కాబట్టి, భోగినాడు పితృదేవతలను పూజించే సంప్రదాయం వచ్చింది. అసలు పుత్రుడు అంటే అర్థం పున్నామ నరకం నుండి రక్షించువాడు. పున్నామ నరకం నుండి రక్షింపబడితేనే స్వర్గం లభిస్తుంది. చాలామంది కొడుకు కావాలని కోరుకుంటారు. ఆడపిల్ల అయితే పెళ్లికాగానే ఇల్లు విడిచి, పరాయి చోటుకి వెళ్ళిపోతుంది. కొడుకు అయితే, మన దగ్గర ఉంటాడు. ముసలి కణంలో ఆదరిస్తాడు. మనం వంశం పేరు నిలబెడతాడు. చచ్చిన తర్వాత కర్మ కాండల పుణ్యకార్యము చేస్తాడు, అని ఆశపడతారు అందరూ. తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు పుట్టనేమి వాడు గిట్టనేమి, అన్నాడు వేమన. మనకు జన్మనిచ్చిన వారిని సంవత్సరానికి, ఒకసారి అయినా తలుచుకోవటం కొడుకులు బాధ్యత, పుణ్యప్రదం అని తెలిపారు.

# వసతి గృహాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకుంటా: ఎమ్మెల్యే**

**జహీరాబాద్, సెప్టెంబర్ 27 (వుదయం )**



జహీరాబాద్ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రీమెట్రిక్ వసతి గృహాల సలహా సంఘ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన మెనూ, పంపిణీ చేస్తున్న వస్తువులు తదితర అంశాలపై అధికారులు సమావేశంలో వివరించారు. వసతి గృహాల్లో అవసరమైన చిన్నచిన్న మరమ్మతు పనులను కలెక్టర్ సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు ప్రభుత్వ స్థలం కేటాయించి, సొంత భవనాలు నిర్మించాలని సంక్షేమ అధికారులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే ఒక్కో వసతి గృహానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, సమస్యలను నమోదు చేసుకున్నారు. అత్యవసర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సీఎస్ఆర్ పథకం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటానని పేర్కొన్నారు.

వసతి గృహాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ సమావేశంలో శ్రీశైలం, ఏఎస్‌డీఓ నారాయణఖేడ్ డివిజన్, అమర్‌నాథ్, ఏబీసీడీఓ జహీరాబాద్ డివిజన్‌తో పాటు వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌డీఓ కార్యాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు




**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 27 (వుదయం ప్రతినిధి):**

నాగర్ కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) కార్యాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయ భవనాన్ని పునర్నిర్మించాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు G.O.Rt.No.597, తేదీ 26 092026 ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యాలయ పునర్నిర్మాణంతో అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం, రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి కొనసాగిస్తానని తెలిపారు.

# మునిగడపలో ఘనంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ

**తెలంగాణ ఉద్యమకారుడి సేవలు చిరస్మరణీయం బాపూజీ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి: పద్మశాలి సంఘం డిమాండ్**

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 27 : వుదయం**



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్, వట్టిపల్లి గ్రామ పద్మశాలి సంఘాల సౌజన్యంతో మునిగడప గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో కొండ లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడని గుర్తు చేశారు. బాపూజీ జీవిత చరిత్ర, ఆయన చేసిన త్యాగాలను రాబోయే తరాలకు తెలియజేసేలా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ యువత బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల పద్మశాలి ఉపాధ్యక్షుడు ఉద్దేమర్రి చంద్రమౌళి, మునిగడప గ్రామ పద్మశాలి అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి సామల పోచయ్య, మండల యువజన అధ్యక్షుడు రాచకొండ అనిల్ పాల్గొన్నారు. వారితో పాటు గుండ బాలయ్య, సామల లింగం, రాచకొండ భాస్కర్, రాచకొండ నాగేష్, సామల చంద్రమౌళి, రాచకొండ నవీన్, గడ్డమీది సత్తయ్య, గడ్డమీది శ్రీనివాస్, అలాగే తిమ్మాపూర్, వట్టిపల్లి, మునిగడప గ్రామ పద్మశాలి సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పితృవియోగంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి



**వద్దేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో 60 మంది బిఆర్ఎస్ కార్యకర్తల హాజరు**

**చిన్నంబావి మండలం 27 వుదయం రిపోర్టర్**

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామం నుంచి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వద్దేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామానికి చెందిన వద్దేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 60 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రత్యేకంగా బయలుదేరి, పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. "కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన అనుబంధం" బీరం లక్ష్మారెడ్డి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు. కొప్పునూరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై తమ అభిమానాన్ని, ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వద్దేమాన్ రామకృష్ణ ఆధ్వర్యంలో తరలివెళ్లిన కార్యకర్తలు బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.కొప్పునూరు నుంచి 60 మంది కార్యకర్తలు వాహనలలో తరలివెళ్లడం స్థానికంగా ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సానుభూతి



**అక్బర్ పేట భూంపల్లి, సెప్టెంబర్ 27, వుదయం:**

దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్ పేట భూంపల్లి మండలంలోని రుద్రారం గ్రామం లో నిన్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో జరిగిన విషాదకర ఘటనతో ఊరు మొత్తం శోకసంద్రం లో మునిగిపోయిందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులో మునిగి పార రమేష్, కళాల నవీన్ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఈ పెను విషాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు తీరని లోటు అని పేర్కొన్నారు. వారి పార్థివ దేహాలకు నివాళులు అర్పించారు.ఈ విషాద సమయంలో మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, నీటి వనరుల వద్ద నిమజ్జనం సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండా శంకర్, సిద్దిపేట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఏలూరు కమలాకర్, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ అమర్ రెడ్డి, దుబ్బాక నియోజక వర్గ కో ఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, నాయకులు మండల నర్సింలు యాదవ రెడ్డి కుమార్ sc సెల్ మండల అధ్యక్షుడు మండల కుమార్ మాజీ ఎంపీటీసీ నర్సింలు, యాదవరెడ్డి,బొప్పాపూర్ దుబ్బా రాజం,పోతారం రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**ఆయన విగ్రహ చౌరస్తాకు బాపూజీ పేరు నామకరణం పాఠ్యపుస్తకాల్లో బాపూజీ జీవిత చరిత్రను చేర్చాలని డిమాండ్**

**గజ్వేల్, సెప్టెంబర్ 27 : వుదయం**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లిబొత్తుల దేవదాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని, బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విగ్రహ సమూహ ప్రాంతానికి 'ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా'గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో కొండ లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర అజరామరమైనదని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నాడు తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు బాపూజీ అని వారు గుర్తు చేశారు. ఆయన చేసిన త్యాగాలు, జీవిత చరిత్రను రాబోయే తరాలకు తెలియజేసేలా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లా ములుగు గ్రామంలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ యూనివర్సిటీకి 'శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ' అని నామకరణం చేసి ఆయనను గౌరవించుకున్న విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. అదేవిధంగా త్వరలో వరంగల్‌లో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయానికి కూడా కొండ లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని వారు ప్రస్తుత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ యువత బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘాల సభ్యులు, యువకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు మధ్యలో గుంత..

**నెల రోజులుగా మ్యాన్‌హోల్ పనులు పూర్తి చేయని మున్సిపల్ అధికారులు**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 27:వుదయం.**

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డులో డ్రైనేజీ కోసం తవ్విన మ్యాన్‌హోల్ గుంత ప్రమాదకరంగా మారింది. గుంత తవ్వి నెల రోజులు కావస్తున్నా పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో వాహనదారులు, కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారి మధ్యలో గుంత ఉండటంతో రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పొరపాటున ఎవరైనా గుంతలో పడితే తీవ్ర గాయాలయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి మ్యాన్‌హోల్ నిర్మాణ పనులు పూర్తి చేసి, గుంతను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# కుక్క కాటును తేలికగా తీసుకోవద్దు

**సకాలంలో చికిత్సతో రేబిస్ నివారణ సాధ్యం**

**బిజినపల్లి, సెప్టెంబరు 27, (వుదయం ప్రతినిధి):**




కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్స తీసుకుంటే రేబిస్‌ను నివారించవచ్చని పాలెం వైద్యాధికారి డాక్టర్ ఎం. ప్రియాంక తెలిపారు. సెప్టెంబరు 28న ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. రేబిస్ సోకిన జంతువుల కాటు, గీతల ద్వారా వ్యాపిస్తుందని, కుక్కలు ప్రధాన వ్యాప్తి కారకాలన్నారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని 15 నిమిషాల పాటు పారే నీరు, సబ్బుతో శుభ్రంగా కడగాలని సూచించారు. గాయానికి కుట్లు, పట్టీలు వేయడం, పసరు, నూనె, పసుపు వంటివి పూయకూడదన్నారు. ఆకుపసర్లు, మోటు వైద్యాన్ని నమ్మి సమయం వృథా చేయవద్దని సూచించారు. కాటు తీవ్రతను బట్టి అవసరమైన రేబిస్ వ్యాక్సిన్ డోసులను జిల్లాలోని పీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

# రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలి

**నంగునూరులో 'మాల విద్యార్థి గర్జన' పోస్టర్ ఆవిష్కరణ విద్య, ఉద్యోగాల్లో అర్హులైన మాల విద్యార్థులకు న్యాయం చేయాలి**

**నంగునూరు, సెప్టెంబర్ 27 వుదయం**



విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న రోస్టర్ విధానాన్ని సమగ్రంగా పునః సమీక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో 'మాల విద్యార్థి గర్జన' మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వద్ద రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ నియామకాల్లో అమలవుతున్న ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా నియామక ప్రక్రియలోని రోస్టర్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'మాల విద్యార్థి గర్జన' మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో తమకు జరుగుతున్న అన్యాయాలను మహాసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రోస్టర్ విధానంపై సమగ్ర చర్చ జరిపి, సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నియామక విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, నంగునూరు గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, మాలమహానాడు నాయకులు శ్రవణ్, అల్లిబిల్లి నరసింహారావు, బడే రాజయ్య, రాగుల కనకయ్య, పులి రవి, రాగుల కృష్ణ, దాసరి రమేశ్, జెల్ల మహేందర్, దండు ఆనంద్, సాయి శ్యామ్, బడే అజయ్, రాకేశ్, ఈశ్వర చందు, కార్యదర్శి రాజు ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ నాస్తిక్, ఎంఎస్ఎస్ జిల్లా సభ్యులు శేఖర్, బుట్టి సాయి, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మండల స్థాయి బాధ్యులు, యువకులు హాజరయ్యారు.'మాల విద్యార్థి గర్జన' మహాసభకు విద్యార్థులు, నిరుద్యోగ యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి రాష్ట్రస్థాయి ప్రతిభ

**మిరుదొడ్డి:**



మిరుదొడ్డి మండలం అల్వాలపెద్ద చెప్యాల కూడలిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఏ. దినేష్ హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపల్ జి.ఎస్. రవీందర్ ఆదివారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దినేష్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు మధు, శ్రీరాములు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



## జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ ఆకస్మిక తనిఖీ

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 27(ఉదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రం శివారులోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, వసతి, భోజన సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. ముందుగా కళాశాలలోని లెక్చరర్ల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు కళాశాలకు సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందుతున్న తీరును కూడా పరిశీలించి, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం కళాశాలలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించిన ఆయన అక్కడ నిల్వ ఉంచిన వంట సామగ్రి, ఇతర ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని వంట ఏజెన్సీ నిర్వాహకులకు స్పష్టం చేశారు. వంట సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వాటినే వంటకు వినియోగించాలని సూచించారు.ముఖ్యంగా పాలు, నూనె తదితర ఆహార పదార్థాలను వినియోగించే ముందు వాటి గడువు తేదీ తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. గడువు ముగిసిన లేదా నాణ్యత లోపించిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే పండ్లు, గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాలు నాణ్యతతో, తాజాగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భోజనం తయారీ సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వంటగది, స్టోర్ రూమ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయాలని సూచించారు.కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కళాశాల సిబ్బందికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపై తక్షణ చర్య తీసుకోవాలి



- **టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్**
- **టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎక్కడ...?**

**నారాయణపేట సెప్టెంబర్ 27(ఉదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవి నోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో నారాయణపేట జిల్లాలోని ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది తీవ్ర ఆర్థిక భారంగా మారుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ఆసుపత్రి పరిస్థితిని సమీక్షించి, అవసరమైన మౌలిక వసతులు, వైద్యులు, వైద్య సిబ్బంది, మందులు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం స్థానికంగానే అందేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా కార్యదర్శి పల్లెబండ నర్సిములు, నర్సాపూర్ లాలప్ప, రఘు తదితరులు పాల్గొన్నారు.

**టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎక్కడ...?**

గత కొంతకాలంగా టిఆర్ఎస్ చేస్తున్న కార్యక్రమాలలో ఎక్కడా కూడా పట్టణ అధ్యక్షుడు చంద్రు కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన టిఆర్ఎస్ బృందం లో సైతం పట్టణ అధ్యక్షులు కనిపించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. జిల్లా కేంద్రంలో పార్టీ పరిస్థితి ఇలా ఉంటే పాంచ జన్య సూత్రాలు కొనసాగించడం ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి




- **సదాశివపేటలో ఘనంగా జయంతి వేడుకలు.. కూచిపూడి కళాక్షేత్రం ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డి ఉదయం**

సదాశివపేట పట్టణంలో తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను, తెలంగాణ సమాజం కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. బాపూజీ చూపిన సామాజిక స్పృహ, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు మన సమాజానికి గొప్ప వారసత్వమని ఎమ్మెల్యే అన్నారు. వాటిని పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువతలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కళాక్షేత్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కూచిపూడి వంటి శాస్త్రీయ కళలకు సదాశివపేటలో మరింత ఆదరణ లభించేలా ఈ కళాక్షేత్రం ఒక మంచి వేదికగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. చిన్నారులు, యువత కళలను నేర్చుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

# గద్వాలలో గందరగోళం!

- **కబ్జాల రాజ్యం.. మాఫియాల మోత.. నేరాల జోరు!**
- **అధికారుల మౌనం ఎందుకు? రాజకీయ జోక్యం ఎంత? పోలీసుల పనితీరుపై ప్రజల్లో ఎందుకీ అసంతృప్తి?**

**గద్వాల సెప్టెంబర్ 27 (ఉదయం బ్యూరో)**



గద్వాలకు ఏమైంది? ఒకప్పుడు ప్రశాంతంగా కనిపించిన ప్రాంతంలో ఇప్పుడు వరుసగా వినిపిస్తున్న ఆరోపణలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. భూ కబ్జాలు, గంజాయి, కల్తీ మద్యం, బెల్ట్ షాపులు, మట్టి-ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాల్లో జోక్యం, కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చడం.. ఇలా ఒక్కటేమిటి? అనేక సమస్యలపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగు తోంది. అయితే ఇన్ని ఆరోపణలు వస్తున్నా వ్యవస్థ ఎందుకు కదలడం లేదు? ప్రజల్లో ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. కబ్జాలకు అడ్డుకట్ట ఎక్కడ? భూమి అంటే సామాన్యుడికి జీవితకాల సంపాదన. అలాంటి భూముల విషయంలో అక్రమ జోక్యం,కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోప ణలు వస్తే వాటిని తేలికగా తీసుకోవచ్చా? ఒక సామాన్యుడు తన భూమి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు పలుకుబడి ఉన్నవారు పలుకుబడి అంటే మాఫియాలదే నడుస్తోంది మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఆరోపణలు కొత్తవి కావు. కానీ వాటిని అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఎక్కడ? రాత్రివేళల్లో అక్రమ రవాణా జరుగుతోందా?

**అనుమతులు లేకుండా తవ్వకాలు సాగుతున్నాయా?**

పట్టుబడిన వాహనాలపై ఏం చర్యలు తీసుకున్నారు? అక్రమాలకు సహకరించే వారిపై ఎప్పుడైనా కఠిన చర్యలు జరిగాయా? ప్రశ్నలు ఎన్నో.. సమాధానాలు మాత్రం ఎక్కడ? గ్రామాల్లో బెల్ట్ షాపులు.. అధికారులకు కనిపించవా? గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుస్తున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం ఉంటే సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి. కానీ ప్రజల్లో మరో ప్రశ్న ఉంది—మాకు కనిపిస్తున్నది అధికారులకు ఎందుకు కనిపించడం లేదు?" ఇది కేవలం ఒక శాఖను ప్రశ్నించే విషయం కాదు. వ్యవస్థ పనితీరుపై నిలిచిన ప్రశ్న. గంజాయి యువత భవిష్యత్తు ఎవరి బాధ్యత మాదకద్రవ్యాల వ్యాప్తి ఏ ప్రాంతానికైనా ప్రమాదకరమే. గంజాయి వినియోగం, విక్రయంపై ఆరోపణలు ఉంటే వాటిపై కఠిన నిఘా అవసరం. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత కుటుంబానిదే కాదు.. పోలీస్, విద్యా, సామాజిక వ్యవస్థలదీ. యువత చేతిలో పుస్తకం ఉండాలా.. మత్తు పదార్థం ఉండాలా? అనే ప్రశ్నకు సమాజం మొత్తం సమాధానం చెప్పాల్సిన సమయం ఇది.పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే సామాన్యుడు ఎందుకు భయపడాలి? పోలీస్ స్టేషన్ అంటే బాధితుడికి భరోసా కలిగించే ప్రదేశంగా ఉండాలి. కానీ పోలీసులపైనే ఆరోపణలు వస్తున్నాయంటే వాటిని అత్యంత తీవ్రంగా పరిగణించాలి. ఫిర్యాదు స్వీకరణలో ఆలస్యమా? కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యమా? దర్యాప్తులో పక్షపాతమా? లేక రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్ల ప్రభావమా? కాపాడాల్సిన వ్యవస్థే తమను కాపాడటం లేదనే భావన" ఒక్క సామాన్యుడిలోనైనా కలిగితే.. అది వ్యవస్థకు ప్రమాద సంకేతమే. ఆరోపణలు నిజమైతే చర్యలు తప్పనిసరి. నిజం కాకపోతే అవి ఎందుకు వస్తున్నాయో కూడా పరిశీలించాల్సిందే. రాజకీయ అండ ఉంటే చట్టం వెనక్కి తగ్గుతుందా? ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను సంప్రదించడం సహజం. కానీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అనుచరుల కోసం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వస్తే వాటిపై కూడా స్పష్టత అవసరం. రాజకీయ పరిచయం ఒక రక్షణ కవచంగా మారితే.. సామాన్యుడికి చట్టం ఎక్కడ మిగులు తుంది? తప్పు ఎవరు చేసినా చర్య ఒకటే ఉండాలి. అధికారుల మౌనం.. ప్రజల్లో అనుమానాలకు కారణమా? జిల్లా స్థాయి అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**ప్రతి ఆరోపణ నిజమేనని చెప్పడం ఎంత తప్పో.. ప్రతి ఆరోపణను పట్టించుకోక పోవడం కూడా అంతే ప్రమాదకరం.**

అందుకే సంబంధిత శాఖలు స్పందించాలి.

**ఫిర్యాదులు ఎన్ని? చర్యలు ఎన్ని? కేసులు ఎన్ని? దర్యాప్తులు ఎక్కడివరకు వచ్చాయి?**

అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే ఎవరిపై చర్యలు తీసుకున్నారు? ఈ వివరాలు బయటకు వస్తేనే ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగుతాయి. నాలుగో స్థంభంపైనా అనుమానాలా? ప్రజల తర పున నిలబడి ప్రశ్నించాల్సిన మీడియా వ్యవస్థపై కూడా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మీడియా ప్రతినిధులు సంబంధాలు, ప్రయోజనాల కారణంగా కొన్ని అంశాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు నిజమా కాదా అన్నది ఆధారాలతోనే తేలాలి. అయితే జర్నలిజం అంటే అధికారాన్ని ప్రశ్నించడం మాత్రమే కాదు.. బాధితుడి మాట వినడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వివరణ తీసుకోవడం, ఆధారాలను పరిశీలించడం, నిజాన్ని ప్రజల ముందుం చడం. ఇది ఒక్కరి వైఫల్యమా? లేక వ్యవస్థ వైఫల్యమా? గద్వాలలోని ప్రతి సమస్యకు ఒక వ్యక్తిని, ఒక పార్టీని, ఒక శాఖను బాధ్యుడిగా చేయడం సరికాదు. కానీ సమస్యలు వరుసగా వస్తున్నప్పుడు మాత్రం వ్యవస్థను ప్రశ్నించాల్సిందే. రెవెన్యూ వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోంది?

**పోలీసింగ్‌లో పర్యవేక్షణ ఎక్కడ తగ్గింది?**

**ఎక్సైజ్ నిఘా ఎందుకు సరిపోవడం లేదు?**

మైనింగ్ అక్రమాలపై చర్యలు ఎందుకు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి? రాజకీయ జోక్యంపై వస్తున్న ఆరోపణలకు సమాధానం ఏమిటి? ఇకనైనా మేల్కొంటారా? ప్రజలకు కావాల్సింది హామీలు కాదు. ప్రకటనలు కాదు. సమావేశాలు కాదు. చర్యలు కావాలి. కబ్జాపై చర్య కావాలి. అక్రమ మద్యం మీద చర్య కావాలి. మాద కద్రవ్యా లపై ఉక్కుపాదం కావాలి. అక్రమ ఇసుక మట్టి రవాణాపై కఠిన నిఘా కావాలి.

ఫిర్యాదు చేసిన సామాన్యుడికి రక్షణ కావాలి. భూ వివాదాల్లో నిష్పాక్షిక విచారణ కావాలి. ముఖ్యంగా— ఎవరి పలుకుబడి ఎంత?" కాదు.. "చట్టం ముందు ఎవరు?" అన్నదే తేలాలి. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల కోసం. పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణ కోసం. అధికార యంత్రాంగం ప్రజలకు సేవ చేయడానికి. మీడియా ప్రజల గొంతుకగా నిలవడానికి. ఈ నాలుగు వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఉంటేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. గద్వాలలో ఇప్పుడు వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే సామా న్యుడి పక్షాన నిలబడేది ఎవరు?" ఆ ప్రశ్నకు సమాధానం మాటల్లో కాదు.నిష్పాక్షిక విచారణలో.. చట్టబద్ధమైన చర్యల్లో.. పారదర్శక పరిపాలనలో..ప్రజలకు కనిపించే జవాబుదారీతనంలో ఉండాలి. గద్వాలకు ఏమైంది? ఇది ఇక ఒక ప్రాంతం గురించి అడిగే ప్రశ్న మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి ఎలా నిలబెడతారన్న ప్రశ్న.

## రేషన్ డీలర్ కూతుళ్లు ఇద్దరూ ఎంబీబీఎస్

**అచ్చంపేట, సెప్టెంబరు 27 (ఉదయం ప్రతినిధి):**



కొడుకులను వంశోద్ధారకులుగా చూసే సమాజంలో కూతుళ్లనే భేదం చూడకుండా కష్టపడి చదివించి ఇద్దరు కుమార్తెలను వైద్య విద్య వైపు నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అచ్చంపేట మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాత్లావత్ గోపీనాథ్.ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపంతో తాను ఉన్నత విద్యకు నోచుకోలేదని, తాను చేసిన పొరపాటు తన కూతుళ్ల విషయంలో చేయకూడదని గిరిజన కుటుంబం నుండి ఇద్దరినీ డాక్టర్లుగా తీర్చిదిద్దుతున్నారు.మారుమూల నల్లమల ప్రాంతమైన అంకిరెడ్డిపల్లి గ్రామ చౌక ధరల దుకాణం డీలర్ గా గోపీనాథ్ పని చేస్తుండగా, భార్య విజయపద్మ తమకున్న కొద్ది పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, ఇరుగుపొరుగు వారి పొలాల్లో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. గోపీనాథ్ నెలలో 15 రోజులు రేషన్ డీలర్ గా బియ్యం పంపిణీ చేస్తూ, ఖాళీ సమయంలో సొంత ఆటో నడుపుతూ తన ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆయన కుమార్తెలు వైద్య విద్యలో సీట్లు సాధించారు. పెద్ద కూతురు జానకి ప్రియ 2025లో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ లో చేరి మొదటి సంవత్సరం పూర్తి చేసింది. రెండో కూతురు దేవిప్రియ ఈ ఏడాది వనపర్తి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.ఒకే కుటుంబంలో ఇద్దరు గిరిజన విద్యార్థినులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అచ్చంపేట ప్రాంతంలో అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒకే కుటుంబం, ఒకే గ్రామం నుండి ఇద్దరు గిరిజన విద్యార్థినులు డాక్టర్ విద్యను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తుండటం పట్ల సర్పంచ్ కొర్ర కల్పన హర్షం వ్యక్తం చేశారు.

## కేసీఆర్ నగర్‌లో ఐడీబీఐ బ్యాంక్ ఉచిత ఖాతాల ప్రత్యేక క్యాంప్



**ఉదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 27)**

తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్ 2లోని 11వ బ్లాక్‌లో ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత బ్యాంక్ ఖాతాల ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఐడీబీఐ బ్యాంక్, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్‌కు స్థానికులు హాజరై ఖాతాల వివరాలను తెలుసుకున్నారు. జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్లు తెరిచే అవకాశం కల్పించారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల నగదు నేరుగా ఖాతాలో జమ అయ్యేలా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) సదుపాయం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఖాతాదారులకు ఉచిత రూపే డెబిట్ కార్డుతో పాటు నిబంధనల మేరకు రూ.1 లక్ష వరకు ప్రమాద బీమా సదుపాయం ఉంటుందని వివరించారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన తదితర పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సదుపాయాలను స్థానికులు వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఆసక్తి ఉన్న స్థానికులు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కళాశాలలో ఘనంగా పర్యాటక దినోత్సవం

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 27(ఉదయం ప్రతినిధి)**




నారాయణపేట జిల్లా కేంద్రం శివారులోని మైనార్టీ కళాశాలలో ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీపీఆర్ఓ,టూరిజం శాఖ ఇన్‌చార్జి అధికారి రషీద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ పర్యాటక రంగం ఒక ప్రాంతం యొక్క చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా విద్యార్థులకు పుస్తకాల్లో చదివే విషయాలతో పాటు చారిత్రక, సాంస్కృతిక అంశాలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడుతుందని తెలిపారు.మన రాష్ట్రంలో చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, ప్రకృతి అందాలు, జానపద కళలు, సంప్రదాయాలు వంటి అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని, వాటి విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత మన ప్రాంతంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాల గురించి తెలుసుకుని వాటి పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. పర్యాటక రంగం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని, హోటళ్లు, రవాణా, హస్తకళలు, స్థానిక ఉత్పత్తులు, గైడ్ సేవలు తదితర రంగాలకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంచుకుని, మన జిల్లా ప్రత్యేకతలను ఇతరులకు పరిచయం చేయాలని సూచించారు.పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు, ప్రముఖ చారిత్రక కట్టడాలు, జాతీయ పర్యాటక ప్రదేశాలు తదితర అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి విజేతలకు డీపీఆర్ఓ,టూరిజం శాఖ ఇన్‌చార్జి అధికారి రషీద్ బహుమతులను అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు జనరల్ నాలెడ్జ్, చరిత్ర, సంస్కృతి, పర్యాటకం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, సాధారణ జ్ఞానం, పోటీతత్వం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలతో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం కూడా లభించిందన్నారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి



**మిరుదొడ్డి, సెప్టెంబర్ 27, ఉదయం:**

సామాజిక చైతన్యం కోసం నిరంతరం కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గడ్డం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక చైతన్యం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్ర, తెలంగాణ సాధన కోసం చేసిన ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత సామాజిక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు సుతారి రమేష్, కోశాధికారి గడ్డం శ్రీనివాస్, సోషల్ మీడియా ప్రతినిధి సుతారి పరశురాములు, సభ్యులు విట్టల్, మహాదేవ్, వెంకటయ్య, వెంకటేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుర్చీని తన్నిపారేసి.. తెలంగాణ కోసం నిలిచిన బాపూజీ

- **మంత్రి పదవికే రాజీనామా.. ఉద్యమ బాటలో అడుగు**
- **పదవి కాదు.. తెలంగాణ ప్రజల హక్కులే లక్ష్యం**
- **కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**గద్వాల సెప్టెంబర్ 27 (ఉదయం కరస్పాండెంట్)**



అధికార కుర్చీ అందుబాటులో ఉన్నా.. దానిని అంటిపెట్టుకుని ఉండలేదు. మంత్రి పదవి చేతిలో ఉన్నా.. తెలంగాణ ప్రజల ఆకాంక్షల ముందు దానిని వదిలేశారు. పదవిని త్యజించి ఉద్యమాన్ని ఎంచుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం త్యాగానికి, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం అని పద్మశాలి సంఘం నాయకులు పేర్కొన్నారు.తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు, పద్మశాలి ముద్దుబిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గద్వాల పట్టణంలోని ఈదమ్మ గుడి సమీపంలో ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి కుర్చీని వదిలి.. ఉద్యమంలోకి! తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమ బాట పట్టిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని నాయకులు గుర్తుచేశారు. రాజకీయ పదవి కంటే ప్రజల ఆకాంక్షలకు విలువ ఇచ్చారని, అధికారం కంటే తెలంగాణ భవిష్యత్తుకే ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. పదవి కోసం సిద్ధాంతాలను మార్చుకోకుండా.. తన నమ్మిన మార్గం కోసం పదవినే వదులుకున్నారని పేర్కొన్నారు. పోరాటమే ఆయన రాజకీయ జీవితం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న బాపూజీ హైదరాబాద్ సంస్థానంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడారని నాయకులు తెలిపారు. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి ఎమ్మెల్యేగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అధికారంలో ఉన్నప్పటికీ సామాన్య ప్రజలకు దూరం కాలేదని.. తెలంగాణ, చేనేత కార్మికులు, వెనుకబడిన వర్గాల సమస్యలపై నిరంతరం గళమెత్తారని పేర్కొన్నారు. పదవులు మారినా.. ఆయన పోరాటం మారలేదు. రాజకీయ పరిస్థితులు మారినా.. ప్రజల పక్షాన నిలిచిన ఆయన వైఖరిలో మార్పు రాలేదు అని నాయకులు అన్నారు.మంత్రి పదవి పోయింది.. కానీ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. అధికారం దూరమైంది.. కానీ తెలంగాణ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. పదవిని కాపాడుకోవడం కంటే ప్రజల కోసం పోరాడటమే గొప్పదని తన జీవితంతో చాటిచెప్పిన బాపూజీ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. త్యాగం, నిబద్ధత, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు నామాల శ్రీకాంత్, యువజన సంఘం అధ్యక్షుడు అక్కల కుమార్, కమిటీ సభ్యులు, యువజన సంఘం ప్రతినిధులు, పద్మశాలి కులబాంధవులు పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవ సమావేశానికి హాజరైన గౌడ సంఘం



**మెదక్ జిల్లా ఉదయం**

నిజాంపేట మండలంప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన సమావేశానికి నిజాంపేట మండల గౌడ సంఘ సభ్యులు తరలివెళ్లారు. కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీవో రమాదేవి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. పర్యాటక రంగ అభివృద్ధి, చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతపై నిర్వహించిన సమావేశంలో గౌడ సంఘ సభ్యులు బజార్ సిద్ధ గౌడ్,జీడి రాములు గౌడ్, మల్లేశం గౌడ్,స్వామి గౌడ్, అంజా గౌడ్, బాలా గౌడ్, కిషన్ గౌడ్,యాదగౌడ్, నర్సా గౌడ్, వెంకట్ గౌడ్, రంగమొల్ల అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బీరం లక్ష్మారెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్

**చిన్నంబావి మండలం 27 ఉదయం రిపోర్టర్**



కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి, సింగోటం లక్ష్మారెడ్డిగా సుపరిచితులైన బీరం లక్ష్మారెడ్డి ఇటీవల కాలంలో మరణించిన నేపథ్యంలో ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనతో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించి, తన సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, సి. లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కొల్లాపూర్ నియోజక వర్గంలోని వివిధ మండలాల సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారికి బదిలీ నిబంధనలు వర్తించవా?

**ఒకే మండలంలో 8 ఏళ్ళు ..? ..బదిలీలపై ప్రశ్నలు!**

**అనంతగిరి సెప్టెంబర్ 27 వుదయం**

మండల వ్యవసాయ శాఖలో ఒకే అధికారి దీర్ఘకాలంగా కొనసాగుతున్నారనే అంశం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో ఒకే స్టేషన్‌లో ఎక్కువ కాలం కొనసాగకుండా మార్పులు చేపట్టడం ద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కొనసాగించాలనే ఉద్దేశం ఉంటుంది. అయితే మండల వ్యవసాయ అధికారి విషయంలో మాత్రం 8 ఏళ్ల తరబడి ఒకే మండలంలో కొనసాగుతున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**నాలుగేళ్లు దాటితే బదిలీ సంగతేంటి?**

తెలంగాణ ప్రభుత్వం 2024లో జారీ చేసిన బదిలీ మార్గదర్శకాల్లో ఒకే మండలంలో నాలుగేళ్లు పూర్తైన ఉద్యోగులను బదిలీ చేయాలని పేర్కొంది. అదే సమయంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులు ఉండవచ్చని కూడా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అనంతగిరి మండల వ్యవసాయ అధికారికి సంబంధించి ఇక్కడ ఎంతకాలంగా పనిచేస్తున్నారు? ఎన్నిసార్లు బదిలీ ప్రక్రియలో పేరు వచ్చింది? ఏ నిబంధనల ప్రకారం కొనసాగుతున్నారు? అనే వివరాలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**రైతులకు సంబంధించిన శాఖ.. బాధ్యత మరింత కీలకం**

వ్యవసాయ శాఖ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాల అమలు వంటి అనేక సేవలను అందిస్తుంది. మండల వ్యవసాయ అధికారి పరిధిలో వ్యవసాయ విస్తరణ సిబ్బందికి సాంకేతిక మార్గదర్శకత్వం ఇవ్వడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడం వంటి కీలక బాధ్యతలు ఉంటాయి.

అలాంటి కీలకమైన స్థానంలో ఒకే అధికారి సుదీర్ఘకాలం కొనసాగుతున్నట్లయితే, దాని వెనుక ఉన్న పరిపాలనా కారణాలను స్పష్టం చేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంటుంది.

**బదిలీలు ఎందుకు జరగలేదో చెప్పాలి**

ఒకే మండలంలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న అధికారిని సాధారణ బదిలీల్లో ఎందుకు మార్చలేదు? బదిలీ నిబంధనల ప్రకారం ఆయన/ఆమె స్థానానికి మినహాయింపు ఉందా? ఉంటే దానికి కారణం ఏమిటి? అనే అంశాలపై రైతులు, ప్రజలు స్పష్టత కోరుతున్నారు. బదిలీ అనేది శిక్ష కాదని, పరిపాలనా వ్యవస్థలో సాధారణ ప్రక్రియ అని పలువురు పేర్కొంటున్నారు.ఒకే ప్రాంతంలో దీర్ఘకాలం




పనిచేస్తున్న అధికారుల విషయంలో కూడా నిబంధనలు అందరికీ సమానంగా వర్తించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**ఉన్నతాధికారులు పరిశీలించాలి**

మండల వ్యవసాయ అధికారి ఇక్కడ ఎప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నారు? ఇప్పటివరకు ఎన్ని సంవత్సరాలు పూర్తయ్యాయి? గత బదిలీల్లో ఎందుకు కొనసాగించారు? ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం కొనసాగింపునకు ఏదైనా ప్రత్యేక అనుమతి ఉందా? అనే అంశాలను జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

## ఉచిత క్యాన్సర్ మరియు వైద్య పరీక్షల శిబిరం




**యాదాద్రి భువనగిరి జిల్లా , 27 సెప్టెంబర్ 2026**

రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి మరియు మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు భువనగిరి పట్టణంలో ఉచిత క్యాన్సర్ మరియు వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా మహిళలు ఈ ఉచిత క్యాన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్, 2D ఎకోతో పాటు వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ శ్రీమతి పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ శ్రీ నాకోటి నాగేష్, అసిస్టెంట్ గవర్నర్ శ్రీ పక్కీరు కొండల్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీ కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ శ్రీ కదారి రమేష్ బాబు, ట్రెజరర్ శ్రీ పెండెం వేణుగోపాల్, పాల్గొన్నారు.

పాల్గొన్న రోటేరియన్లు డా. యంపల్ల బుచ్చి రెడ్డి – చైర్మన్, మెంబర్‌షిప్, కాకతీయ రీజియన్, శ్రీ జి. జ్ఞాన ప్రకాష్ రెడ్డి – చైర్మన్, సోషల్ మీడియా, శ్రీ బండారు శ్రీనివాస్ రావు – చైర్మన్, ఎన్విరాన్‌మెంట్, కాకతీయ రీజియన్, శ్రీ ఎం.ఎ. రహీం – అధ్యక్షులు, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్, శ్రీ శెట్టి బాలయ్య యాదవ్, శ్రీ మంచికంటి వెంకటేశం, శ్రీ కొక్కులకొండ నిమ్మయ్య. శ్రీ కొమ్మిడి రవీందర్ రెడ్డి, శ్రీ జిలాల కొండల్ రెడ్డి, శ్రీ కోమటి రెడ్డి మోహన్ రెడ్డి, శ్రీ కారిపె నర్సింగ్ రావు, శ్రీ ఇటిక్యాల దేవేంద్ర చారి, శ్రీ దిడ్డి బాలాజీ, శ్రీ కె.జె.ఎస్.వి. ప్రకాష్, శ్రీ పడమటి జగన్మోహన్ రెడ్డి, శ్రీ జిట్ట భాస్కర్ రెడ్డి, శ్రీ తవిటి వెంకట నారాయణ, శ్రీ పాశం పండరీనాథ్, శ్రీ పడాల భాస్కర్ రావు, శ్రీ ఎస్.పి. ఉపేందర్ రావు, శ్రీమతి ఎస్.పి. స్పందన, శ్రీ చొల్లేటి శ్రీనివాస్, శ్రీ భోగ హరికృష్ణ, శ్రీ గూడూరు అశోక్ రెడ్డి, శ్రీ కొంతం పద్మా రెడ్డి, శ్రీ ఎం.డి. హనీఫ్ మేమన్, శ్రీమతి ఇటిక్యాల లావణ్య పాల్గొన్నారు.

**ఉచిత మందులు, అల్పాహారం, భోజనానికి దాతల సహకారం**

ఈ హెల్త్ క్యాంపు కోసం ప్రిన్స్ మెడికల్ హాల్, భువనగిరి అధినేత శ్రీ జాకీర్ గారు సుమారు రూ.1,00,000 విలువైన మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు మరియు రోటరీ సభ్యులకు శ్రీ పకీర్ కొండల్ రెడ్డి గారి ద్వారా సుమారు రూ.2,000 విలువైన అల్పాహారం, టీ ఏర్పాటు చేశారు. అదేవిధంగా శ్రీ సద్ది వెంకట్ రెడ్డి గారు, అధినేత, వివేరా హోటల్, భువనగిరి, సుమారు రూ.25,000 విలువైన మధ్యాహ్న భోజనాన్ని ప్రజలకు ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు, మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి బూత్ లెవెల్ ఏజెంట్లే మూలస్తంభాలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది బూత్ లెవెల్ ఏజెంట్లే



**చింతకాని: సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి) :**

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బూత్ లెవెల్ ఏజెంట్లే (బిఎల్ఏలు) పార్టీకి నిజమైన మూలస్తంభాలని, వారికి పార్టీ మరియు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా పాలనకు మంచి పేరు తీసుకురావాలని ఆయన బిఎల్ఏలకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఆదివారం నిర్వహించిన చింతకాని మండల కాంగ్రెస్ బిఎల్ఏల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చింతకాని మండలంలోని బిఎల్ఏల పనితీరు, శ్రమ మిగతా మండలాల కంటే చాలా అద్భుతంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు. పార్టీ కన్నతల్లి లాంటిదని, కాంగ్రెస్ ప్రభావాన్ని పెంచేందుకు శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్త శ్రమకు తగిన గౌరవం లభిస్తుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చి ప్రజా పాలనకు మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత బిఎల్ఏలపైనే ఉందన్నారు. గత 10 ఏళ్లలో మన ప్రభుత్వం లేకపోవడం వల్ల మధిర నియోజకవర్గంలో అభివృద్ధి వెనుకబడిందని, గత 10 సంవత్సరాలు మరియు ఈ 5 సంవత్సరాలు కలిపి మొత్తం 15 ఏళ్ల నాటి అభివృద్ధిని కేవలం ఈ 5 ఏళ్ల కాలంలోనే కాలంతో పోటీ పడి పూర్తి చేద్దామని అన్నారు. రాబోయే రెండేళ్లలో పాఠశాలలు, రోడ్లు, ఆసుపత్రులు వంటి అన్ని పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి, నాయకులు గ్రామాల్లో తలఎత్తుకొని తిరిగేలా చేస్తామని స్పష్టం చేశారు.

**27 లక్షల మంది విద్యార్థులకు**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో దాదాపు 1 కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి ఒక్కరికీ నెలకు 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని, ఇది దేశంలోనే ఆదర్శవంతమైన 'తెలంగాణ మోడల్' అని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆర్థిక ఊరట కల్పించడమే కాకుండా, డ్వాక్రా రుణాల పునరుద్ధరణ చేపట్టి లక్ష కోట్ల రుణాలు ఇచ్చే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండటంతో గ్రామాల్లో 80 నుంచి 90 శాతం మంది ఒక్క రూపాయి బిల్లు లేకుండా నాణ్యమైన విద్యుత్ పొందుతున్నారని కొనియాడారు. పేదల వైద్యం కోసం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచామని, రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ఉచితంగా రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించే 'ఇందిరమ్మ" ధీమా పథకాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు విద్యారంగంలో గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన ఫీజు రియంబర్స్ మెంటు బకాయిలు క్లియర్ చేసి, నేరుగా విద్యార్థుల ఖాతాలోకే జమ చేసి ఇప్పుడు ఎప్పుడు విప్లవాత్మక విధానం తెచ్చామని తెలిపారు, ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా వేడి అల్పాహారం. పాలు రాగి జావా అందిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాలలో.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు వివరించాడు ఈ ఆత్మీయ సమావేశంలో టిపిసిసి పరిశీలకులు దుద్దిళ్ల శ్రీను బాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నేబోయిన గోపి మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## స్వతంత్ర భారత చరిత్రలో వినూత్న పథకం సన్న బియ్యం పథకం



**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**

పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

ఆదివారం నేరేడుచర్ల పట్టణంలోని ఎస్కేఎస్ ఫంక్షన్ హాల్ లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ ప్రభుత్వమే. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్న బియ్యం పథకం లేదు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, రాష్ట్రంలో మొత్తం 1,06,28,092 రేషన్ కార్డుల ద్వారా 3,42,57,109 మంది ఆహార భద్రత పొందుతున్నారని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 3,72,658 రేషన్ కార్డులు ఉండగా, హుజూర్ నగర్ నియోజకవర్గంలో 1,08,011 కార్డులు ఉన్నాయన్నారు. ఈ రోజు కొత్తగా గరిడేపల్లి మండలంలో 20,258, పాలకీడు మండలంలో 9,095, నేరేడుచర్ల మండలంలో 14,035 రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన దొడ్డుబియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీకి, రైస్ మిల్లర్ల అక్రమాలకు ఉపయోగపడ్డాయని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం అందిస్తోందని అన్నారు. రాష్ట్రంలో 85% మంది జనాభాకు కడుపునిండా అన్నం పెట్టడం సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ... సన్న బియ్యం పథకం, కొత్త రేషన్ కార్డుల పంపిణీని తిరుమలగిరి నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని, అర్హులై ఉండి కార్డు రానివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అగ్రికల్చర్ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న, జిల్లా ఎస్పీ కె. నరసింహ, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, తహసీల్దార్లు సైదులు, వాజిద్, స్రవంతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**చిలుకూరు సెప్టెంబర్ 27: ( వుదయం )**



ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న సి ఆర్ పి కవిత, పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న (పార్ట్ టైం ఇన్స్పెక్టర్) క్రాఫ్ట్ టీచర్ మల్లం ఝాన్సీరాణి లకు సర్వ శిక్ష అభియాన్ సంఘం నాయకులు ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పాఠశాలకు విద్యార్థులకు మరిన్ని సేవలు అందించి మనల్ని పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో,సి ఆర్ పి విజయ నిర్మల, తేజ, స్పందన,పార్ట్ టైం ఇన్ స్టకర్లు పర్వతం శ్రీధర్, రెమిడాల కృష్ణమూర్తి, శ్రీరాముల స్వరూప, మల్లెపంగు శోభన్, పసుపు లేటి నరసింహారావు, వట్టికూటి రాధ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**సూర్యాపేట సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**

తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం 9 గంటలకు కస్తూరిబజార్ లోని అప్పం వీరయ్య మెమోరియల్ పద్మశాలి సంఘ భవనంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు అప్పం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ కనిగిరి శ్రీరామ్, అప్పం శ్రీనివాసరావు మాట్లాడుతూ... బాపూజీ నిగర్వి, నిజాయితీపరుడని, స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో చివరి క్షణం వరకు నిస్వార్థంగా పోరాటం చేసిన మహానాయకుడని కొనియాడారు.

**వ్యాసరచన పోటీలు – బహుమతుల ప్రదానం:**

ఈ సందర్భంగా పద్మశాలి యువసేవ కోఆర్డినేటర్ పున్న వెంకన్న ఆధ్వర్యంలో 8 ప్రభుత్వ స్కూల్స్, కాలేజీల్లో బాపూజీ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి స్కూల్ నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారితో పాటు టౌన్ ఫైనల్ లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టౌన్ ఫైనల్ లో ప్రథమ – బి. రేణు శ్రీ (పీఎం సారీ జడ్.పి.హెచ్.ఎస్), ద్వితీయ – కె. హరిప్రియ (గవర్నమెంట్ నెంబర్ టు స్కూల్), తృతీయ – ఎస్ డి. సబియా (గవర్నమెంట్ నెంబర్ వన్ స్కూల్ ) లు గెలుపొందారు. మొత్తం 24 మంది విద్యార్థులకు రూ.20 వేల నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. అలాగే కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ముగ్గురు పద్మశాలి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గండూరి రమేష్, నాగుల శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహా, ఏలే సత్యనారాయణ, దూలం నగేష్, సుదర్శన్, చిలువేరు నరసింహారావు, కదారి బిక్షం, యలగందుల సాయి, కనుకుంట్ల శారదాదేవి, గోడిశాల వెంకటేశ్వర్లు, బాల్నే క్రాంతి, మిరియాల సుధాకర్, కొంగరి ఉపేందర్, చిదిరాల శోభ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ

**అశ్వారావుపేట సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం కొత్త మామిళ్ల వారి గూడెం గ్రామ పంచాయతీ నందు గ్రామ సర్పంచ్ వగ్గేల. లక్ష్మణరావు మరియు ఉప సర్పంచ్ వీర్నల. శ్రీనివాసరావు చేతుల మీదగా కొత్తమామిళ్ల వారి గూడెం కొడారి. రాజేష్. ఊర్లగూడెం వగ్గేల. బాబురావు కు (CMRF) సీఎం రిలీఫ్ పందు చెక్కులు పంపిణీ చేసినారు అనంతరం సర్పంచ్ వగ్గేల. లక్ష్మణరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్యం విద్య ఉపాధి పలు సంక్షేమ పథకాలు అందిస్తుందనే అన్నారు అనంతరం వైస్ సర్పంచ్: వీర్నాల. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద పేద ప్రజలకు మరియు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య ఖర్చుల కోసం అందిస్తున్న (CMRF) సీఎం ఆర్ ఎఫ్ రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుంది తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడమే. మా లక్ష్యం ప్రజల సంక్షేమం మా ధ్యేయం అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లపు. దుర్గారావు సోషల్ మీడియా కోఆర్డినేటర్ సవలం. హరీష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంఘ పరివార్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



**రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డి**

**చండూరు, సెప్టెంబరు 27 (వుదయం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంఘ పరివార్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, దేశం కోసం పనిచేసే కార్యకర్తలకు క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా యువ మోర్చా (BJYM) డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు.కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో గాంధీ పరివార్‌కు, సంఘ పరివార్‌కు మధ్య జరిగే పోరాటంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితిని రేవంత్ అభివర్ణించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలు సాధారణ రాజకీయ విమర్శల స్థాయిని దాటి, దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న లక్షలాది మంది కార్యకర్తల భావజాలాన్ని, త్యాగాలను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు.

**అది కుటుంబం కాదు.. దేశభక్తుల సమూహం**

"సంఘ పరివార్ అంటే ఒక కుటుంబం కాదు.. దేశభక్తి, సేవ, క్రమశిక్షణ, సమాజ నిర్మాణం కోసం పనిచేసే లక్షలాది మంది కార్యకర్తల సమూహం" అని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. 'దేశమే ప్రథమం' అనే భావనతో స్వార్థ రాజకీయాలకు దూరంగా పనిచేసే కార్యకర్తల సేవలను ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తక్కువ చేసి మాట్లాడటం సరి కాదన్నారు.అధికారం ఏ ఒక్క కుటుంబానికీ శాశ్వత వారసత్వం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని రేవంత్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఒక కుటుంబం చుట్టూ రాజకీయాలు తిప్పడం మానేసి.. తెలంగాణ ప్రజల సమస్యలు, యువత భవిష్యత్తు, రైతుల సంక్షేమం, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి సారించాలని సూచించారు.విధానాలు, సిద్ధాంతాలపై ఆరోగ్యకరమైన చర్చకు రావాలే తప్ప, నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలను అవమానించడం సముచితం కాదన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ఆ హోదాకు తగిన భాష మాట్లాడాలని, సంఘ పరివార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రోస్టర్ సవరణకు సదస్సును విజయవంతం చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతపల్లి
- నల్గొండ జిల్లా అధ్యక్షుడు బల్లెం ప్రవీణ్‌కుమార్



**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 27, వుదయం ప్రతినిధి**

నల్గొండ పట్టణ కేంద్రంలో మాల విద్యార్థులు, ఉద్యోగులకు రోస్టర్ విధానం వల్ల జరుగుతున్న అన్యాయాన్ని సవరించాలనే డిమాండ్‌తో అక్టోబర్ 4న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాల విద్యార్థులు, ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ AMSA నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం నల్గొండ పట్టణంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో AMSA నల్గొండ జిల్లా అధ్యక్షుడు బల్లెం ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ AMSA అధ్యక్షుడు నామ సైదులు హాజరై మాట్లాడారు. మాల విద్యార్థులు, ఉద్యోగులకు రోస్టర్ విధానం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని సవరించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యపై చర్చించేందుకు నల్గొండ జిల్లా కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4న ఉదయం 10 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే సదస్సుకు విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతపల్లి బాలకృష్ణ, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకన్న, ఈసం నరసింహ, ఎన్నమల్ల మల్లికార్జున్, దాసరి వెంకన్న, గాదరి సైదులు, గోలి రాము, రసమళ్ల వినయ్, నేతకాని శ్యామ్, బొప్పని జానీ, వల్కి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 26 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై.. జ్ఞాపకాలను పంచుకున్న నేతాజీ పూర్వ విద్యార్థులు



**సూర్యాపేట సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నేతాజీ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక తిరుమల గ్రాండ్ లో ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత ఆనాటి విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడంతో ఆ ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నాటి బడి రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ... ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ పొద్దంతా ఆనందంగా గడిపారు.

అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దిన ఆనాటి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కరస్పాండెంట్ బడుగుల లింగయ్య యాదవ్ బెల్లంకొండ అంజయ్య సార్ జాన్ వెస్లీ సార్, భాను మేడం, జానీ సార్, అంజయ్య సార్, నరసింహారావు సార్,చంద్రయ్య సార్ , వెంకటేశ్వర సార్, లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పామాయిల్ రైతులకు కేంద్రం శరాఘాతం

- దిగుమతి సుంకం తగ్గింపును వెంటనే వెనక్కి తీసుకోవాలి
- జిల్లా పామాయిల్ రైతు సంఘంఅధ్యక్షులు మన్నెం సదాశివరెడ్డి

**సూర్యాపేట సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**



కేంద్ర ప్రభుత్వం పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ పామాయిల్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సూర్యాపేట జిల్లా పామాయిల్ రైతుల సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా సంఘం అధ్యక్షులు మన్నెం సదాశివ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దిగుమతి సుంకాన్ని తగ్గించడం దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కోరిన ప్రకారం సుంకాన్ని 27.5% నుండి 44% కి పెంచాల్సి ఉండగా, కేవలం 11% కి తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే ఈ రైతు వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అన్ని ప్రయత్నాలు చేయాలని, ప్రభుత్వం ఎలాంటి పోరాటానికి పిలుపునిచ్చినా పామాయిల్ రైతులు సిద్ధంగా ఉటారని స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం నిర్ణయం మార్చుకోకపోతే, మన రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ప్రతిపాదించిన మినిమం గ్యారంటీ ప్రైస్ రూ. 25,000/– లో, ఈ సుంకం తగ్గింపు వల్ల గెలల ధరలు ఎంతవరకు తగ్గితే ఆ నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం బోనస్ రూపంలో భర్తీ చేయాలని కోరారు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నట్లుగా వరికి ప్రత్యామ్నాయ పంటగా పామాయిల్ వైపు రైతులు ఆలోచిస్తారని, ప్రభుత్వం విరివిగా ప్రచారం చేసి విస్తృతంగా పామాయిల్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించినందుకు సార్థకత చేకూరుతుందని, గిట్టుబాటు ధరలు కల్పించిన ప్రభుత్వంగా రైతుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## కస్తాల వార్డు మెంబర్ల ఫోరం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**చండూరు, సెప్టెంబరు 27(వుదయం):**

చండూరు మండలం కస్తాల గ్రామంలో వార్డు మెంబర్ల ఫోరం గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోనాల శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మెరుగు అంజయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొమ్మరబోయిన పావని, గురజాల రమ్య, ప్రధాన కార్యదర్శిగా కట్ట సైదులు, కోశాధికారిగా శ్రీనివాస్ ఎంపికయ్యారు. సలహాదారులుగా బొమ్మరబోయిన కవిత, బండి శోభ, అమలూరి అశోక్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వార్డు మెంబర్లందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు,వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారానికి



ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిలో అవక తవకలు మండల స్థాయి అధికారి యంత్రాంగంలో తనిఖీలు

- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ నాయకులు వెర్పుల రాజేష్

**చిలుకూరు సెప్టెంబర్ 27: ( వుదయం )**



మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గ్రామ పంచాయతీలో ఆదివారం ఉపాధి హామీ పని పథకంలో తనిఖీలు లో భాగంగా మండల స్థాయి అధికారుల సమక్షంలో గ్రామ సభల నిర్వహించినారు, 7 వార్డు నెంబర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెర్పుల రాజేష్, మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని కొంతమంది నాయకులు కావాలని పక్కదారి పట్టించి నిధుల దుర్వినియోగానికి పడుతున్నారని ఆరోపించారు.అలాగే ఒకే ఇంట్లో మూడు జాబు కార్డులు ఎలా ఉంటాయి అని అన్నారు, ఒక వ్యక్తి ఒక జాబు కార్డు పై 27 వేల రూపాయలు ఎలా డ్రా చేస్తారు అని మండల స్థాయి అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారి ఈసీ ప్రసాద్, మాట్లాడుతూ అధికార యంత్రాంగం దర్యాప్తు జరిపి దోషులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ తనిఖీలు సోషల్ ఆడిట్ గ్రామ సభకు డిఆర్పి తేజ శ్రీ బిఆర్పిలు గోపమ్మ, ఈసీ ప్రసాద్, గౌరవార్డు సభ్యులు గన్న కోటేష్ వర్మ, వేర్పుల రాజేష్, వేమూరి కృష్ణయ్య, మీసాల కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భాస్కర్ విజయ్, మాజీ సర్పంచ్ గంగా లింగయ్య, వీరయ్య, సాదె నాగేశ్వరరావు , గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పెద్దలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు,

# పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- రూ. 7.90 కోట్లతో పర్యాటక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన
- గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలి
- సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మహిళల ఆర్థిక బలోపేతానికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం
- చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం



**చింతకాని, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి )**

పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి డిప్యూటీ సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతకాని మండల కేంద్రంలోని చెరువు వద్ద రూ.7 కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక వసతుల కల్పన పనులకు, పందిళ్లపల్లి నుండి అనంతసాగర్ మీదుగా చింతకాని జడ్పీ రోడ్డు వరకు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జగన్నాథపురంలో ఖమ్మం–బోనకల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుండి న్యూ మార్కెట్ మీదుగా మత్కేపల్లి– పందిళ్లపల్లి వరకు రూ. 4 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, చింతకాని పరిధిలోని నరసింహాపురం ఎస్సీ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, నాగులవంచ గ్రామంలో నాగులవంచ నుండి రైల్వే కాలనీ ఆర్ అండ్ బీ రోడ్డు అండర్‌పాస్ వరకు రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**34 నెలలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు**

పర్యాటక ప్రాంతాల్లో మౌళిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా గత 34 నెలలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామనితెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60 పైగా విలువైన సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు.ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు.

**మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు**

మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడతలో మరో రెండున్నర లక్షల ఇండ్ల మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలను ప్రవేశ పెట్టామన్నారు. ప్రతి సంవత్సరం మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి బస్సులు, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ MLA కొండబాల కోటేశ్వర రావు, మాజీ MLC లు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్ణోత్సవ సభ

**ధర్మసాగర్ సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**





ఈరోజు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు మాంకాల యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో హనుమకొండ లోని ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో జరిగిన 50 సంవత్సరాల సభ బుద్ధుని మరియు అంబేద్కర్ చిత్రపటాలకు పూలు, పూలమాల వేసి అనంతరం సభ ప్రారంభించడం జరిగింది. ముఖ్య అతిథిగా సత్యశోధక్ సమాజ్ జాతీయ అధ్యక్షులు బి చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 50 సంవత్సరాల కార్యక్రమాన్ని కి హాజరైన యువత అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకొని సంఘంలో పనిచేస్తూ సమాజాన్ని చైతన్య పరచాలని, యువజన సంఘాలే ఈ దేశానికి పట్టుకోమ్మలని, అంబేద్కర్ నినాదమే దేశానికి రక్షణ అని, కావున యువత పెడ త్రోవలో నడవకుండా సన్మార్గంలో బుద్ధుడు, అంబేద్కర్ ,పూలే ఆశయాల కలుగునంగా నడుచుకోవాలని ఐక్యమత్యంతో ముందుకు సాగాలని సంఘ సభ్యత్వం తో ప్రారంభమై సామాజిక చైతన్య దిశగా అడుగు వేయాలని సూచించారు,భారత రాజ్యాగా నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పేరు మీద 1976 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంఘం 1033/77 నెంబర్ తో ఏర్పడి నేటికీ 50 సంవత్సరాలు స్వర్ణోత్సవ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది, ఇట్టి సుదీర్ఘ కాలంలో అనేకమంది సభ్యులు సంఘ నిర్మాణం కొరకు సంఘ భవిష్యత్ కొరకు కృషి చేయడం జరిగింది, సంఘంలో సేవ చేసి మరణించిన వారికి ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాం, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువకులు, యువజన సంఘాలు నిలవాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మధుపాక ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన సహాయ కార్యదర్శి తప్పెట్ల వీరన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య, మహబూబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నీరుడు సామెల్, హనుమకొండ జిల్లా కోశాధికారి చాణిక్య, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కొమురయ్య, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ కోసం పదవులనూ త్యాగం చేసిన బాపూజీ

- ప్రజల ఆకాంక్షలే ముఖ్యమని నిరూపించారు
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నల్గొండ జిల్లా సెప్టెంబరు 27, వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో తెలంగాణ సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ సెంట్రల్ హాల్‌లో ఆదివారం జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, విప్ అద్దంకి దయాకర్, శాసనసభ కార్యదర్శి ఆర్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి**

**నల్లగొండ జిల్లా , సెప్టెంబరు 27 వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి ఉద్యమాల్లో ప్రజలను చైతన్యవంతులను చేసి ఉద్యమ స్ఫూర్తిని నింపిన నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఆదివారం నల్లగొండ పాలకేంద్రం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ తన ఇంటినే ఉద్యమ కార్యాలయంగా మార్చుకున్న త్యాగధనుడని కొనియాడారు. ఆచార్య జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీల స్ఫూర్తితోనే కేసీఆర్ రాజకీయ, ఉద్యమ ప్రస్థానం కొనసాగిందని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా వారు చూపిన మార్గంలోనే ముందుకు సాగి తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ కృషి చేశారని అన్నారు. బాపూజీ ఆశయాలకు భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను ఎదుర్కొంటోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్‌యాదవ్, సీనియర్ నాయకులు రాపోలు దత్తగణేష్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్, నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, తిప్పర్తి, కనగల్ అధ్యక్షులు పల్రెడ్డి రవీందర్‌రెడ్డి, అయితగోని యాదయ్య, కార్పొరేటర్ మారగోని భవాని గణేష్, దొడ్డి రమేష్, ఎడవెల్లి సింగిల్‌విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ వెంకటయ్య, మిర్యాల యాదగిరి, పెండెం ధనుంజయ, పెరిక కరణ్‌జయరాజ్, మిర్యాల స్వామి, గంజి రాజేందర్, ఏఎస్ చక్రవర్తి, వనపర్తి నాగేశ్వరరావు, చెరుపల్లి జయప్రకాష్, పున్న శ్రీహరి, రాపోలు కరుణాకర్, జల్లా శీను, ఎండీ నజీర్, రొండి విజయ్, వనం శేఖర్, కర్నాటి శివ, వెంకన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## 10 ఏళ్ల బాలుడి అత్యవసర వైద్యానికి సమాచారం గ్రూప్ సభ్యుల చేయూత

- అతి తక్కువ సమయంలో రూ.41,516 సమీకరణ..
- రూ.40 వేల నగదు బాలుడి అమ్మమ్మకు అందజేత
- ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన గ్రూప్ సభ్యులు

**భద్రాచలం 27/9/26 వుదయం ప్రతినిధి:**



ఆదర్శనగర్ కాలనీకి చెందిన రోహిత్ అనే 10 ఏళ్ల బాలుడికి అత్యవసర వైద్య చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న సమాచారం గ్రూప్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి బాలుడి వైద్యానికి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. చిన్న వయస్సులోనే అనారోగ్యంతో అత్యవసర వైద్య చికిత్స అవసరం కావడంతో బాలుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వైద్య ఖర్చులను భరించడం కుటుంబానికి ఇబ్బందికరంగా మారిన పరిస్థితుల్లో విషయం సమాచారం గ్రూప్ సభ్యుల దృష్టికి వచ్చింది. దీంతో ఆలస్యం చేయకుండా బాలుడి వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు గ్రూప్ సభ్యులు ముందుకు వచ్చారు. సభ్యులకు సమాచారం అందిన వెంటనే పలువురు తమకు తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించడంతో అతి తక్కువ సమయంలోనే మొత్తం రూ.41,516 నగదు సమకూరింది. ఈ మొత్తంలో రూ.1,516లను 'మన చిన్నారి చేయూత' బాక్స్‌లో జమ చేయగా, మిగిలిన రూ.40,000లను బాలుడి అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం గ్రూప్ సభ్యుల సమక్షంలో బాలుడు రోహిత్ అమ్మమ్మకు అందజేశారు.

అత్యవసర సమయంలో తమ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచి, చిన్నారి వైద్యానికి సహాయం చేసిన సమాచారం గ్రూప్ సభ్యులకు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలవడం ద్వారా మానవత్వానికి మరోసారి నిదర్శనంగా నిలిచారని పలువురు అభినందించారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో సమాచారం గ్రూప్ సభ్యులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ తమ వంతు సహకారం అందిస్తున్నారని ఈ సందర్భంగా సభ్యులు తెలిపారు. ముఖ్యంగా చిన్నారికి అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో అందరూ కలిసి సహాయం చేయడం విశేషమని పేర్కొన్నారు. కేవలం కొద్ది సమయంలోనే రూ.41,516 సమీకరించడం సభ్యుల మధ్య ఉన్న ఐక్యతకు, పరస్పర సహకారానికి నిదర్శనమని తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని, మనకు చేతనైనంత సహాయం చేయడం ద్వారా బాధిత కుటుంబాలకు కొంత ధైర్యాన్ని కల్పించవచ్చని సభ్యులు పేర్కొన్నారు.

చిన్నారి రోహిత్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితం కొనసాగించాలని సమాచారం గ్రూప్ సభ్యులు ఆకాంక్షించారు. బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సహాయ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి సభ్యుడి సహకారం తమ కుటుంబానికి ఎంతో విలువైనదని, అత్యవసర సమయంలో అందించిన ఈ చేయూతను ఎప్పటికీ మరువలేమని వారు పేర్కొన్నారు. బాలుడి వైద్యానికి సహకరించిన ప్రతి ఒక్కరి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మానవతా సేవా కార్యక్రమాలకు అందరూ సహకరించాలని సమాచారం గ్రూప్ సభ్యులు కోరారు. చిన్నారి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తమ ఆశీస్సులు అందించాలని, రోహిత్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి 111వ జయంతి వేడుకలు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి
- జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ

**నల్లగొండ జిల్లా , సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**



నల్లగొండ పట్టణ కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని నల్లగొండ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ మాజీ మంత్రి, చేనేత రంగానికి అండగా నిలిచిన నాయకుడని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. న్యాయవాదిగా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 97 ఏళ్ల వయసులోనూ ఢిల్లీలో తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తుచేశారు. పద్మశాలీ సామాజిక వర్గానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను గుర్తించి ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుట్ట వెంకన్నగౌడ్, గంజి రాధ, యాదగిరి, కర్నాటి మచ్చగిరి, జేరిపోతుల లింగయ్యగౌడ్, తిరందాస్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

- పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్ర గౌతమి
- జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి

**నల్లగొండ జిల్లా సెప్టెంబరు 27 వుదయం ప్రతినిధి**



నల్లగొండ పట్టణ కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక వంటిదని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి అన్నారు ఆదివారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

గ్రామస్థాయిలో యువజన కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీలో నిబద్ధతతో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ, మండల కమిటీల్లో కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని వారి స్థానంలో క్రియాశీలకంగా పనిచేసే కొత్త వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు.

అర్హులైన ఓట్లు తొలగిపోకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అర్హులైన వారి ఓట్లు తొలగితే వాటిని తిరిగి చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న నల్లగొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చురుగ్గా పని చేయాలని కోరారు. పార్టీ అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి విజయానికి కృషి చేయాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదులో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్యామ్‌చరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్ర రామ్‌సింగ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. పార్టీ అప్పగించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాహుల్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో , నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, కార్పొరేటర్ మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, మండల అధ్యక్షుడు కె.వి.ఆర్.సతీష్, నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రఘునాథ్‌రెడ్డి, మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బనబోయిన రామకృష్ణయాదవ్, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్రెడ్డి భానుచందర్‌రెడ్డి, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మహాధర్నాను జయప్రదం చేయాలి

- తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ చింతా ఎల్లయ్య పిలుపు
- నల్లగొండ జిల్లా ఎస్సీ ఎస్టీ ప్రధాన కార్యదర్శి బొజ్జ సాదేవ్ పిలుపు

**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, రోస్టర్, ఆర్ఓఆర్ రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ విధానంపై స్పష్టత, పారదర్శకత కోసం సెప్టెంబర్ 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ బహుజన విద్యుత్ ఆర్టిజన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా ఎల్లయ్య పిలుపునిచ్చారు

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో మహాధర్నాకు తరలిరావాలని కోరారు. సోమవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం వంటి హక్కులపై ప్రతి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజా ఉద్యోగాల్లో సమాన అవకాశాలకు సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16తో పాటు 16(4), 16(4ఏ)లోని నిబంధనలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు విద్యుత్ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వర్తించే రిజర్వేషన్ నిబంధనలు, ఆర్ఓఆర్, రోస్టర్ నిర్వహణ, ప్రాతినిధ్యం, సీనియారిటీ, పదోన్నతుల్లో రిజర్వేషన్ నిబంధనలు ఏ విధంగా అమలవుతున్నాయో స్పష్టత ఇవ్వాలని కోరారు. నిబంధనల అమలుపై ప్రశ్నించడం ఎవరికీ వ్యతిరేకం కాదని, పారదర్శకత కోసం సమాధానం కోరడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సమష్టి సమస్యలుగా చూడాలని, ఉద్యోగులు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఒకరి సమస్యను మరొకరు పట్టించుకోకపోతే భవిష్యత్తులో అదే సమస్య తమకు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. చలో హైదరాబాద్.. చలో విద్యుత్ సౌధ పేరుతో నిర్వహించే మహాధర్నాకు ఎస్సీ, ఎస్టీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని చింతా ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. రోస్టర్, ఆర్ఓఆర్‌పై స్పష్టత, పారదర్శకత, ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్యంపై స్పష్టత, వర్తించే నిబంధనల అమలు కోసం ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు

## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దగ్ధం



- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర గౌతమి
- నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి

**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 27 వుదయం ప్రతినిధి**

నల్లగొండ పట్టణ కేంద్రంలో దేశంలో ఓటు హక్కు ప్రక్రియను నాశనం చేస్తున్న కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ మోదీ ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉంటూ ఓటు హక్కును భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషనర్ పదవికి ఆయన వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే దేశంలో బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి శ్యామ్‌చరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర గౌతమి, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రామ్‌సింగ్, యువజన కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కార్పొరేటర్ మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, కె.వి.ఆర్. సతీష్, పవన్, రఘుమారెడ్డి, అజార్, రాము యాదవ్, భానుచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కట్ర్యాల లో పలు బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శ

**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్**

**వర్ధన్నపేట , సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి ):**

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ కట్ర్యాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తీగల కుమారస్వామి గౌడ్ ఇటీవల మరణించగా ఆదివారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బీరవెల్లి లింగమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని వారిని పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జు సంపత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తుళ్ల కుమార్, రామోజీ కమ్మరిగూడెం తిరుపతి మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

- భూ యజమానులు తమ భూ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి
- పర్వతగిరి తహాసిల్దార్ వెంకటస్వామి

**పర్వతగిరి,సెప్టెంబర్ 27( వుదయం ప్రతినిధి ):**

భూ యజమానులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీ–సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని పర్వతగిరి మండల తహసిల్దార్ టి. వెంకటస్వామి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని జమల్ పురం గ్రామంలో భూభారతి రీ–సర్వేలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూభారతి కార్యక్రమం ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి రీ–సర్వేలో భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను పకడ్బందీగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. రీ–సర్వే ప్రక్రియలో భాగంగా భూ యజమానులు, రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. భూ వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. భూముల హద్దులు, రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలు, ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని తహసిల్దార్ పేర్కొన్నారు. గొలుసుల సహాయంతో నిర్వహించే సర్వే ప్రక్రియకు భిన్నంగా ప్రస్తుతం ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రీ–సర్వేను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేర్లు ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శలు

**జయశంకర్ భూపాలపల్లి:**
**సెప్టెంబర్ 27(వుదయం జిల్లా ప్రతినిధి)**

భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామ ఉపసర్పంచ్ లావుడియా రమేష్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా ఆదివారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు అదేక్రమంలో కొంపల్లి గ్రామ చెందిన పాతూరి రాజిరెడ్డి, ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటం వద్ద నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గొర్లవీడు గ్రామనికి చెందిన మందల అమృతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండల మరియు పట్టణ బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జయంతి

**కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కోరుట్ల పట్టణ కార్గిల్ చౌకు వద్ద గల కొండా లక్ష్మణ్ బాపూజీ బాబూజీ జయంతి వేడుకలను నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనుప్ రావు పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విగ్రహ కమిటీ చైర్మన్ రుద్ర శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమిరెడ్డి విజయ ఆజాద్ డాక్టర్ జంగలి వెంకట్ ప్రజా సంఘాల జేఏసీ పేట భాస్కర్ లు విచ్చేసి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప నాయకుడని నిరంతరం తెలంగాణ కొరకు శ్రమించిన గొప్ప వ్యక్తి అని ఆయన ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని కోరారు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పోపా ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీలకు రాజకీయ చైతన్యం కల్పించడం కొరకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు తదుపరి విజేతలకు జ్ఞాపిక కతో పాటు నగదు బహుమతి అందజేశారు ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షులు ముల్క ప్రసాద్ విగ్రహ కమిటీ ముఖ్య సమన్వయ కర్తలు ఎంబేరి నాగభూషణం ఆడెపు మధు గుడ్ల మనోహర్ జిల్లా ధనంజయ్ జక్కుల జగదీశ్వర్ ఎక్కల్ దేవి నవీన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్ యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ పద్మశాలి మహిళా అధ్యక్షురాలు మచ్చ కవిత పోపా పట్టణ అధ్యక్షులు అందె శివప్రసాద్ కౌన్సిలర్లు కస్తూరి లక్ష్మీనారాయణ ఇందూరి తిరుమల వాసు కొక్కెర వెంకటేష్ నాయకులు అన్నం అనిల్ పుప్పాల ప్రభాకర్ విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి కస్తూరి రమేష్ సహాయ కార్యదర్శి ఎంబేరి సత్యనారాయణ కోశాధికారి మార్త సతీష్ పద్మశాలి సంఘ ఉపాధ్యక్షులు కటుకం వినయ్ ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్ అందె రాజ్ కుమార్ మాజీ కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ పెండం గణేష్ పండిత్ రాజేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం



మాజీ పద్మశాలి సంఘం అధ్యక్షులు జక్కుల ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు వేగ్యారపు మురళి మహిపాల్ రెడ్డి ఎంఏ నయీమ్ కటుకం చంద్ర శేఖర్ కటుకం దివాకర్ లు టిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలి శ్రీనివాస్ చింతామణి ప్రభు బీజేపీ నాయకులు ఆకుల రంజిత్ ఎర్ర రాజేందర్ మ్యాకల గణేష్ చట్ పెల్లి రంజిత్ లు పద్మశాలి సంఘ సీనియర్ నాయకులు రుద్ర సుధాకర్ ఆడెపు నరేష్ కస్తూరి జ్యానేశ్వర్ చెట్ పెల్లి శంకర్ గోనే శంకర్ ఎక్కల్ దేవి సురేందర్ గోనే రాజేష్ ఖన్నా యువత ఉపాధ్యక్షులు రాడం మహేందర్ చిలుక శ్రీనివాస్ పోపా ప్రధాన కార్యదర్శి భోగ శ్రీధర్ కోశాధికారి మహేష్ సభ్యులు అందె రాజేంద్ర ప్రసాద్ గడ్డం రాజేంద్రప్రసాద్ అల్లే ధనుంజయ్ పోపా సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఉత్సాహంగా ఉల్లాస్–ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్షలు

**15,556 మంది మహిళల హాజరు..**
**99.5 శాతం హాజరు నమోదు**

**కామారెడ్డి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):-**



కామారెడ్డి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు డిఆర్డీఏ–టీఎస్ఈఆర్పీ ఆధ్వర్యంలో ఉల్లాస్ – "అమ్మకు అక్షరమాల" కార్యక్రమంలో భాగంగా జాతీయ అక్షరాస్యత మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్–FLNAT పరీక్షలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 25 మండలాల్లో 520 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పరీక్షలకు హాజరయ్యారు. గత నెల రోజులుగా స్వయం సహాయక సంఘాల్లో చదవడం, రాయడం రాని మహిళలను గుర్తించి, వారికి అక్షరాస్యత కల్పించేందుకు విఓఏఎస్ స్వచ్ఛంద ఉపాధ్యాయులుగా రాత్రి వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. చదవడం, రాయడంపై వారికి శిక్షణ అందించారు. ఉల్లాస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో డిఆర్డీఏ–TSERP అధికారులకు మండలాల వారీగా విధులు కేటాయించి, పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. డిఆర్డీఏ అదనపు డిఆర్డీవో కె.పి. విజయలక్ష్మి గాంధారి, బాన్సువాడ, బీర్కూర్, మహ్మద్‌నగర్ మండలాల్లో పర్యటించి పలు ఉల్లాస్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ రవీందర్, కామారెడ్డి జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ శుభం క్షేత్రస్థాయిలో పర్యటించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. సదాశివనగర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ పరీక్షా కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు ఏ. పురుషోత్తం సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. మెప్మా పరిధిలో పిడి మెప్మా శ్రీధర్ రెడ్డి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,634 మంది అభ్యాసకులను పరీక్షలకు సిద్ధం చేయగా, 15,556 మంది మహిళలు పరీక్షలకు హాజరయ్యారు. దీంతో 99.5 శాతం హాజరు నమోదైంది. "అమ్మకు అక్షరమాల" పరీక్షలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పండగ వాతావరణాన్ని తలపించేలా మహిళలు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు కూడా పరీక్షా కేంద్రాలను సందర్శించి మహిళలకు ప్రశ్నపత్రాలు, పెన్నులు అందజేసి పరీక్షలను ప్రారంభించారు.

జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో, బాధ్యతాయుతంగా పూర్తి చేసి ఉల్లాస్ – FLNAT పరీక్షలను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన సెర్ప్ సిబ్బంది, అదనపు డిఆర్డీవో కె.పి. విజయలక్ష్మి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, విఓఎస్ లు, పిడీ మెప్మా సిబ్బంది, ఆర్పీలు, సెర్ప్ మెప్మా సిబ్బందిని డిఆర్డీవో పి. దామోదర్ అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచి సామాజికంగా, ఆర్థికంగా మరింత సాధికారత సాధించేలా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడి ప్రాణాలు కాపాడిన బ్లూకోట్స్ సిబ్బంది

**బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ను అభినందించిన జిల్లా ఎస్పీ**

**కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని బ్లూకోట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు కొడిమ్యాల మండలం దొంగలమర్రి చెక్‌పోస్ట్ సమీపంలో శంకర్రావుపేట గ్రామానికి చెందిన వంశీ (23) కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు 112 డయల్ కు సమాచారం అందింది సమాచారం అందిన వెంటనే కొడిమ్యాల బ్లూకోట్స్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి తక్షణమే చేరుకుని కాపాడడం తో పాటు పరిస్థితిని గమనించి యువకుడికి ధైర్యం చెప్పడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించారు అనంతరం యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు విధి నిర్వహణలో అప్రమత్తత సమయస్ఫూర్తి మానవత్వంతో స్పందించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ అన్నారు బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్ వేగంగా స్పందించి ఒక విలువైన ప్రాణాన్ని కాపాడడం అభినందనీయమని కొనియాడారు అలాగే ఆత్మహత్య ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని జీవితంలో ఎలాంటి కష్టాలు కుటుంబ సమస్యలు ఆర్థిక ఇబ్బందులు లేదా వ్యక్తి గత ఒత్తిడులు ఎదురైనా ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

## యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)**



యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంఛార్జి అమీర్ అబ్దుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో యువజన కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాలు, మండలాల వారీగా పార్టీ కార్యకలాపాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, రానున్న కార్యక్రమాలపై సమీక్షించారు. యువతను పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు, యువత సమస్యలపై చురుకైన పాత్ర పోషించాలని చర్చించారు. ప్రతి గ్రామంలో యువతను సంఘటితం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్ ముదిరాజ్, జిల్లా, అసెంబ్లీ స్థాయి నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులే

- **జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**
- **ఉత్తమ ఉపాధ్యాయులు తాళ్ళపల్లి కమలాకర్ కు సన్మానం**

**జగిత్యాల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



విద్యార్థుల భవిష్యత్తుకు బాటలువేసి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధ క్రమ శిక్షణ నైపుణ్యం జ్ఞానం అందించడంలో ఎంతో కీలకపాత్ర వహించడం అభినందనీయమని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ కొనియాడారు ఆదివారం జిల్లా కేంద్రం జగిత్యాల రెడ్డి ఫంక్షన్ హాల్లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో బెస్ట్ టీచర్ అవార్డు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ సమాజ నిర్మాతలుగా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో చూపుతున్న శ్రద్ధ క్రమశిక్షణ నైపుణ్యం జ్ఞానం అందించడంలో ఎంతో కీలకపాత్ర వహించడం గొప్ప విషయమన్నారు ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దినేష్ ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ఈ.వి వేణుగోపాల్ , నటుడు వరుణ్ తేజ్





**మల్యాల మండలం సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి )**

మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానమునకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈ.వి. వేణుగోపాల్ మరియు ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి అంజనా రెడ్డి ఘన స్వాగతం పలికారు.స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు మరియు శేషవస్త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల ఎస్ఐ సందీప్ , ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రచయితల వేదిక నూతన కార్యాలయం ప్రారంభం

**తెరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్**

**కామారెడ్డి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లా తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యాలయాన్ని కామారెడ్డి లోని ప్రియ టాకీస్ రోడ్ లో తెరవే ఆధ్వర్యంలో ఎన్నీల ముచ్చట్లు సమన్వయ కర్త గంగాప్రసాద్ ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నూతన కార్యాలయంలో తెరవే సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ, కవులు ప్రజా సమస్యలపై కవితలు రాసి ప్రజల పక్షం నిలవాలన్నారు. ప్రజల పక్షం వహించి తెరవే నిత్య చైతన్యవంతం చేస్తూ ముందుకు వెళ్తున్నదన్నారు. తదుపరి నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవితా గానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ డివిజన్ అధ్యక్షులు సుదర్శన్, శ్రీనివాస్, ఎన్నీల ముచ్చట్లు సమన్వయకర్త గంగాప్రసాద్, పీతాంబర్, మారుతి, మోహన్ రాజ్, మెదక్ జిల్లా తెరవే అధ్యక్షులు తిరుపతి, నాగభూషణం, రవీందర్, బాలకృష్ణ, నర్సయ్య, చంద్రకాంత్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.






## బ్యాంకర్లకు నల్లరోజు.. అమానవీయ చర్యలను ఖండించిన సిబ్బంది

**ముత్తారం స్పెషల్ 27(వుదయం ప్రతినిధి):**

బ్యాంకర్లపై దేశవ్యాప్తంగా జరుగుతున్న అమానవీయ చర్యలను నిరసిస్తూ ఆదివారం ముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించారు.ఇటీవల బ్యాంకు అధికారులపై చోటుచేసుకున్న దాడులు,వేధింపుల ఘటనలను ఖండిస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముత్తారం శాఖ మేనేజర్ వినయ్ మాట్లాడుతూ ఇది కేవలం సానుభూతి కోసం చేపట్టిన కార్యక్రమం కాదు.. బ్యాంకర్ల హక్కులు,భద్రత కోసం మన గొంతును వినిపించే ప్రయత్నం.విధి నిర్వహణలో ఉన్న బ్యాంకు సిబ్బందిపై జరుగుతున్న అన్యాయాలను సహించలేం.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి.అన్యాయానికి ఎదురుగా బ్యాంకర్లు అందరూ ఒక్కటిగా నిలబడాల్సిన అవసరం ఉందిఅని అన్నారు.బ్యాంకింగ్ సేవలు ప్రజల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొని బాధితుల పట్ల సంఘీభావం వ్యక్తం చేశారు.



## అన్ని దానాల్లో కన్న విద్యా దానం మిన్న

**కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**

మనం చేసే దానాలతో విద్య దానం చాలా విలువైనదని అది విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఉపయోగపడుతుందని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి మురళి మోహన చారి పేర్కొన్నారు ఎద్యుమార్గం సంస్థ ద్వారా 5 ప్రభుత్వ పాఠశాలలకు 30 వేల రూపాయల విలువైన ఆక్సిఫోర్డ్ పాకెట్స్ డిక్షనరీస్ ఇంగ్లీష్ మోరల్ స్టోరీ బుక్స్ పంపిణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎద్యుమార్గం సంస్థ పలు కార్యక్రమాలను చేపట్టడాన్ని ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎంఇఓ గంగుల నరేశం సంస్థ వైస్ చైర్మన్ అల్లే కిరణ్ కుమార్ తేజస్విని ఆంగ్ల భాషోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మిస్సింగ్ , కేసు నమోదు

**మల్యాల మండలం సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి )**



మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన పత్రి రాజశేఖర్ అనే వ్యక్తి కులవృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తనకు 8 సంవత్సరాల క్రితం సంగీత అను ఆమెతో వివాహం కాగా,వారి వైవహిక జీవితంలో ఇద్దరు పిల్లలు, శనివారం ఉదయం పత్రి రాజశేఖర్ పని మీద నిజామాబాద్ కు వెళ్లగా, తన భార్య పిల్లలకు తోడుగా తన తల్లి పత్రి లక్ష్మి ని ఉండమని చెప్పాడు.అదే రోజు రాత్రి సమయంలో పిల్లలతో సహా భోజనం చేసి నిద్రించగా ఆదివారం ఉదయం సమయంలో తన తల్లి బాత్రూం కి వెళ్ళడానికి లేవగా సంగీత కనబడలేదని పత్రి రాజశేఖర్ కి ఫోన్ చేసి చెప్పగా,తను ఇంటికి వచ్చి చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో మరియు చుట్టుపక్కల గ్రామాలలో వెతకగా కనబడకపోయేసరికి మల్యాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

## మనస్తాపంతో చెట్టుకి ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**మల్యాల మండలం సెప్టెంబర్ 27 ( వుదయం ప్రతినిధి )**



దొరపల్లి గ్రామం డోన్ మండలం నంద్యాల ఆంధ్రప్రదేశ్ కి చెందిన రాచూటి అద్దాల ఎల్లయ్య తన భార్య, కొడుకు మరియు కోడలితో సహా ప్రస్తుతం జగిత్యాల జిల్లాలోని నర్సింగాపూర్ శివారులో ఉంటూ చిల్లర బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తన కొడుకు రాచుటి అద్దాల చరణ్ ( 24 ) గత కొన్ని సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. యధావిధిగా రోజు లాగానే ఆదివారం ఉదయం బట్టలు వ్యాపారం కొనసాగించుటకు కొండగట్టుకు ఈభూతి శేఖర్ తో కలిసి వచ్చి తిరిగి ఇంటికి రాకపోగా కాల్ చేస్తే లిఫ్ట్ చేయకపోయేసరికి, చుట్టుపక్కల గ్రామాలలో వెతుకగా బలవంతపూర్ గ్రామ శివారులో శివాలయం దగ్గర ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడని మృతుని తండ్రి రాచోటి అద్దాల ఎల్లయ్య మల్యాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

# నిర్మల్ పోలీస్.. మీ పోలీస్



- **36 గంటల నిరంతర పోలీస్ బందోబస్తు..**
- **ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనోత్సవాలు**
- **జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ నాయకత్వంలో విజయవంతంగా నిర్వహణ**

**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 27 సెప్టెంబర్ 2026**

నిర్మల్ జిల్లాలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవాలు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ నాయకత్వంలో అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయి. గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర పోలీస్ అధికారులు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది సుమారు 36 గంటల పాటు నిరంతరంగా విధుల్లో ఉండి, శాంతిభద్రతలను పటిష్టంగా పర్యవేక్షించారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే మార్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ ప్రాంతాల పర్యవేక్షణ, విగ్రహాల నిమజ్జన ప్రక్రియ, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ఎక్కడా చిన్న అవాంఛనీయ ఘటనకు కూడా తావులేకుండా నిమజ్జనోత్సవాలను విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా పూర్తి కావడానికి సహకరించిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. 36 గంటల పాటు నిర్విరామంగా విధులు నిర్వహించి గణేష్ నిమజ్జనోత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారి, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలు

**తెలంగాణ ఉద్యమ సింబల్, బహుజన పక్షపాతి**
**ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చందన**

**గజ్వేల్, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో ఆయన జయంతి ఉత్సవాలను ప్రభుత్వ లాంఛనాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చందనా రవీందర్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ గొప్ప మహనీయుడని, నిస్వార్థ నాయకుడని, స్వాతంత్ర సమరయోధుడని మరియు తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అని కొనియాడారు. ఆయన చూపిన సత్యం, అంకితభావం, నిస్వార్థ సేవ అనే మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే గొప్ప నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్ చైర్మన్ పద్మ, బూరుగుపల్లి ప్రతాప్ రెడ్డి, సర్దార్ ఖాన్, కౌన్సిలర్లు కాముని మురళి, రొట్టెల శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, మార్కండేయ దేవాలయం అధ్యక్షులు గడ్డమీద ఆంజనేయులు, ప్రముఖ అడ్వకేట్లు, పద్మశాలి కుల పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

**ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**గజ్వేల్, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ రోడ్డులో ఉన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కులు, ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని, ముఖ్యంగా పద్మశాలి, చేనేత సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నేతన్నల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, బతుకమ్మ చీరల తయారీ వంటి పథకాల ద్వారా ఉపాధి కల్పించారని, మార్కెటింగ్, వర్క్‌షెడ్లు, కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణంతో రంగాన్ని బలోపేతం చేశారని గుర్తుచేశారు. బాపూజీ చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, చేనేత కార్మికుల సంక్షేమాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పద్మశాలి సంఘం నాయకులు, బాపూజీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

**మాదిగ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రమేష్**

**జగదేవపూర్, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)**



స్వాతంత్ర్య సమరంలో చెమట, నెత్తురు ధారపోసి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాదిగ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల రమేష్ కొనియాడారు. నరాలతో దారాలు పేని లోకానికి వస్త్రాన్ని ప్రసాదించిన ఘనత పద్మశాలి సమాజానిదని, అలాంటి పవిత్ర వంశంలో జన్మించిన బాపూజీ పోరాట పటిమ భవిష్యత్ తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం తన పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రిగా ఆయన చరిత్రకెక్కారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల నుంచి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, సామాజిక న్యాయానికే పెద్దపీట వేసి దళిత నాయకుడు దామోదరం సంజీవయ్యను సీఎంగా చేయడానికి బాపూజీ నిస్వార్థంగా కృషి చేశారని తెలిపారు. తెలంగాణ గడ్డపై ఆయన చూపిన అంకితభావం అపారమైనదని, కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈ సందర్భంగా రమేష్ పిలుపునిచ్చారు.

# రైతుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం కృషి

**ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి)

ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్లో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సమా రాజేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో 137 వ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొని నూతనంగా ఎన్నికైన పాల కవర్గ సభ్యులను అభినందించిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయర మణ రావు గారు.. ముందుగా టీవీ9 & సిటీకేబుల్ పాత్రికేయమిత్రులు TK రమేష్ గారి మృతిపట్ల వారికి సంతాపన్ని తెలిపారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబానికే వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని అలాగే ధరణి పేరుతో పదేళ్లలో భూదోపిడీ జరిగిందని ఆరోపించారు అలాగే ధరణి వల్ల కేసీఆర్ కుటుంబానికే మేలు జరిగిందని పేదల భూములు గల్లంతయ్యాయని అన్నారు.22Aపై రాద్ధాంతం చేసిన బీఆర్ఎస్ నేతల ఆస్తులు బయటపడుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు.బినామీ పేర్లతో కేసీఆర్ కుటుంబానికి ఇంకా ఎన్ని వేల కోట్ల ఆస్తులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని ఈ సందర్భంగా అన్నారు అలాగే 22A పరిధిలో ఉన్నది 3 లక్షల 76 వేల ఎకరాలు మాత్రమే.. కోటి ఎకరాలంటూ హరీష్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.కాళేశ్వరం నీళ్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క కూడా రాలేదని కాళేశ్వరం నీరు వచ్చినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు అలాగే సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉన్నందున వర్షాలపై ప్రభావం ఉంటుందని, ఖరీఫ్‌లో అవసరాల మేరకు రెండు తడులకు ఎస్సారెస్పీ నీరు అందించి పంటలను కాపాడతామని హామీ ఇచ్చారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో శ్రీ. కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు మరియు డైరెక్టర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కి భారతరత్న ప్రకటించాలి

- **పద్మశాలి సంఘం అధ్యక్షులు కొలిపాక మల్లయ్య**
- **జాతీయ యువజన అవార్డు గ్రహీత, యువజన సంఘం అధ్యక్షులు అలువాల విష్ణు**

రామడుగు, సెప్టెంబర్ 27 (వుదయంప్రతినిధి )



ప్రముఖ స్వాతంత్ర్య, సమర యోధులు బడుగు బలహీన వర్గాల చేనేత ముద్దుబిడ్డ తెలంగాణ తొలి ఉద్యమ ధృవతార మాజీ మంత్రివర్యులు,ఉద్యమాల పితామహుడు తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కి భారతరత్న ప్రకటించాలిఅని పద్మశాలిసంఘంఅధ్యక్షులు కొలిపాక మల్లయ్యజాతీయ యువజన అవార్డు గ్రహీత, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అలువాలవిష్ణులుఅన్నారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం గోపాల్ రావు పేట ఆధ్వర్యంలో ఆదివారం సంఘంభవనంలోఆయనచిత్రపటానికిపూలమాలలువేసినివాళులుఅర్పించడంజరిగింది.అనంతరం వారుమాట్లాడుతూప్రముఖస్వాతంత్ర్య సమర యోధులు బడుగు బలహీన వర్గాల చేనేత ముద్దుబిడ్డ తెలంగాణతొలిఉద్యమధృవతారమాజీమంత్రివర్యులు తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అనే పేరు సమస్త ఉద్యమాలకు చిరునామాఅని.నిజాంవ్యతిరేకఉద్యమం,వందేమాతరం ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, సహకార ఉద్యమం, తెలంగాణగడ్డపైచెలరేగినఉద్యమరూపాలన్నింటికీ అండగా, జెండాగా నిలిచిన గొప్ప రాజనీతిజ్ఞుడు 16 ఏళ్ల చిరుప్రాయంలో మొదలుపెట్టిన ఉద్యమ జీవితాన్ని 97 ఏళ్ల పండువయసులో ముగించి అందరికీ ఆదర్శంగానిలిచారని పేర్కొన్నారు. జీవితమంతా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే కృషి కృషి చేశారని,తుదిశ్వాసవిడిచేవరకూ తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాడి, జీవిత మలిసంధ్యలో వయోభారాన్నిలెక్కచేయకుండా ఎక్కడ తెలంగాణ టెంట్ మొలిస్తేఅక్కడప్రత్యక్షమవుతూ యువతకు స్ఫూర్తినిచ్చారు.. చారిత్రక నైజాం వ్యతిరేక పోరాటం నుంచి ఇటీవలి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దాకా రాష్ట్ర రాజకీయాల్లో బాపూజీ తనదైన ముద్ర వేశారు అని, బాపూజీ జీవితాన్ని నేటితరం నాయకులకు ఆదర్శం వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనజ నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కొలిపాక కమలాకర్ రాపల్లి శ్రీనివాస్ మచ్చ గంగయ్య రుద్ర నాగరాజ్ కొలిపాక నాగరాజ్ గోనె రాజు లక్ష్మణ్ శ్రీనివాస్ మామిడాల నాగరాజు కమలాకర్ రుద్రరాజు భూమయ్య మల్లేశం జగదీష్ రాములు లక్ష్మీనారాయణ సత్యనారాయణ రామచంద్రం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సభను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ సభ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య పిలుపునిచ్చారు ఆదివారం కథలపూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశం నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య పాల్గొని కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.



**ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ**

అనంతరం 34 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా మంజూరైన చెక్కులను 25 లక్షల 93 వేల విలువ గల 68 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య తో కలిసి అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకున్న నాయకులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి జన సమీకరణ చేపట్టాలని నిర్ణయించిన సంఖ్యకు అదనంగా మరో పది మంది వచ్చేలా చూడాలని సూచించారు జన సమీకరణపై మండల జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీ కూడా సమీక్షించే అవకాశం ఉందని తెలిపారు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే సుమారు 1,000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు తాజాగా మరో సుమారు 250 కోట్ల రూపాయలకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయని తెలిపారు సిరిసిల్లకు 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ 10 కోట్ల రూపాయలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరయ్యాయని తెలిపారు కోనరావుపేటకు కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు వివరించారు ఇవన్నీ ఇప్పటికే కొనసాగుతున్న 1,000 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు అదనమని తెలిపారు వేములవాడ రాజన్న ఆలయానికి 99.40 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు రానున్న కాలంలో జిల్లాకు మరో 400 నుండి 500 కోట్ల రూపాయల మేర అదనపు అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు . డిసెంబ ర్ 3వ తేదీ నుంచే బీఆర్ఎస్ పార్టీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అజీమ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు తొట్ల అంజయ్య కాంగ్రెస్ నాయకులు జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చేదలు సత్యనారాయణ నాయకులు బండ శంకర్ పులి హరిప్రసాద్ గంగాధర్ వెలిచాల సత్యనారాయణ పలువురు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

కరీంనగర్ సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి):



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్ బైపాస్ చౌరస్తాలోని ఆ మహనీయుడి విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవం, బడుగు బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. పదవులు, అధికారాల కంటే ప్రజల హక్కులకే ప్రాధాన్యమిస్తూ జీవితాంతం ప్రజాసేవకు అంకితమైన మహనీయుడిగా ఆయన సేవలను మేయర్ అడిషనల్ కలెక్టర్ కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అందేలా కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్, బీసీ సంక్షేమ శాఖ ఎం. అనిల్ ప్రకాష్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, వేముల కవిత చంద్రశేఖర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుడిమళ్ల శ్రీనివాస్, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పోరండ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి అల్ప భద్రయ్య, మాజీ సుడా డైరెక్టర్ వంగర రవీందర్, యువజన సంఘం ఉపాధ్యక్షుడు మెతుకు కృష్ణ చైతన్య, జిల్లా ఉపాధ్యక్షుడు స్వర్గం నర్సయ్య, ప్రచార కార్యదర్శి మార్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ యువతకు ఆదర్శం

**బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ**

కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)



కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ అన్నారు ఆదివారం కోరుట్ల పట్టణ కార్గిల్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం శికారి గోపికృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల ఆశాజ్యోతి మూడు తరాల ఉద్యమ యోధుడు తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు బీసీ ఉద్యమ నేత రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషికి తగిన గుర్తింపు ప్రాధాన్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక తెలంగాణగా ఆవిష్కరించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాపూజీ ఆశయాల సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ బీసీ సీనియర్ నాయకులు బెజ్జారపు ప్రవీణ్ కుమార్ నిమ్మల రంజిత్ కుమార్ ఇందూరి నరేష్ కుమార్ తోగిటి లక్ష్మణ్ శ్రీనివాస్ రాచకొండ చందు హనుమంతు రథాల పంపు యువత సభ్యులు బీసీ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా ఉల్లాస్ పరీక్షలకు శ్రీకారం

ముత్తారం సెప్టెంబర్ 27(వుదయం ప్రతినిధి):

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక గుర్తింపు, సాధికారత కల్పించే లక్ష్యంతో చేపట్టిన మహిళా ఉల్లాస్ పరీక్షలను ఆదివారం కేశనపల్లి, హరిపురం,జిల్లాలపల్లి గ్రామాల ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఘనంగా ప్రారంభించారు.కేశనపల్లిలో సర్పంచ్ పేగడ తిరుమల కుమార్,హరిపురంలో మెంగని సమత తిరుపతి,జిల్లాలపల్లిలో గడ్డం రాజేష్ పరీక్షా కేంద్రాలను ప్రారంభించి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు విద్య,జ్ఞానం,నైపుణ్యాల పెంపుతో సమాజంలో మరింత గుర్తింపు పొందాలని,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పరీక్షలకు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగనవేన సదయ్య,వార్డు సభ్యులు గూట్ల శంకర్,బుర్ర రవీందర్,కల్వచర్ల మల్లయ్య, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చిందం సదానందం,పెరుగ అశోక్,మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ పర్యాటక దినోత్సవం...

**ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

జగిత్యాల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి) తేదీ 27 సెప్టెంబర్ 2026

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయికల్ పట్టణ కేంద్రంలో గల శ్రీ చెన్నకేశవ నాద త్రికుటాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ విచ్చేసి అధ్యక్షత వహించారు ఇట్టి కార్యక్రమమంలో అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ పాల్గొన్నారు జిల్లాలోని 20 మండలాలకు సంబంధించిన వ్యాసరచన పెయింటింగ్ వకృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు 250 మంది మొదటి రెండవ మూడవ బహుమతులకు ప్రశంసా పత్రాలు మెడల్స్ ను ప్రధానం చేశారు అంతేకాకుండా 50 మంది కల్చరల్ విభాగంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలు మెడల్స్ ను అందజేశారు ఇట్టి కార్యక్రమమునకు జిల్లా విద్యాధికారి మున్సిపల్ కమిషనర్ రాయికల్ మున్సిపల్ అధ్యక్షులు కటకం రవి పాలకవర్గం దేవస్థానం అధ్యక్షులు పాలకవర్గం గ్రామ పుర ప్రముఖులు ప్రజలు దాదాపు 500 మంది వరకు పాల్గొని ఇట్టి కార్యక్రమను విజయవంతం చేయనైనదని జిల్లా పర్యాటక యువజన క్రీడల శాఖ అధికారి డాక్టర్ కే రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన ప్రజాసేవ తెలంగాణ కోసం ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు.



# కౌన్సిలింగ్ తో వృద్ధుల కేసులు పరిష్కారం

జగిత్యాల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)

జిల్లా లోని జగిత్యాల మెట్ పల్లి కోరుట్ల డివిజన్ల మండలాలకు చెందిన నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రుల ఫిర్యాదులపై వారి కొడుకులు కూతుర్లు కోడళ్ళను ఆదివారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు కౌన్సిలింగ్ కు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన ఫోటోకు పూల మాలలు వేసి నివాళులర్పించారు అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు వృద్ధుల చట్టం శిక్షలను వారు తల్లిదండ్రుల నుంచి పొందిన ఆస్తులు తిరిగి వారి పేరిట మార్చే వీలుందని వివరిస్తూ కౌన్సిలింగ్ చేయడంతో వారు స్పందించి తమ తల్లిదండ్రులను పోషణ రక్షణ బాగోగులు మా బాధ్యతేనని అఫిడవిట్స్ సమర్పించి వెంట తీసుకెళ్లారు తమకు భోజన సౌకర్యం కల్పించి సమస్యలు పరిష్కరించిన హరి అశోక్ కుమార్ కు ఆ వృద్ధ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కౌన్సిలింగ్ లో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ప్రతినిధులు పిసి హన్మంత్ రెడ్డి గౌరిశెట్టి విశ్వనాథం పూసాల అశోక్ రావు వెల్ముల ప్రకాష్ రావు ఎండి యాకూబ్ కండ్ల గంగాధర్ విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

# జగిత్యాల కు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి రావాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తేదీ 28 9 2026 జగిత్యాలలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పిలుపునిచ్చారు ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలో గల జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వడి భవన్ లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా సర్ కార్యక్రమంలో జరిగిన లోసుగులకు వ్యతిరేకంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్దనున్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జరగనున్న ధర్నాకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని జువ్వాడి కృష్ణారావు పిలుపునిచ్చారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనకు అలుపెరగని పోరాటం చేసి యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

- **జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్**
- **అట్టహాసంగా జరిగిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

పెద్దపల్లి, సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కొండా లక్ష్మణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఇంచార్జి బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ మాట్లాడుతూ, నిజాం పరిపాలన నుండి స్వాతంత్రం, దాని తర్వాత కూడా ఒక రూపం ఇవ్వాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని, మన రాష్ట్రాన్ని కష్టపడి అభివృద్ధి చేసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు , ఇతర ప్రజా ప్రతినిధులు, పద్మశాలి, బి.సి. కుల భాంధవులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ. ఓ .సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో బాపూజీ జయంతి వేడుకలు

జగిత్యాల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)




ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన సేవలు ప్రజా సమస్యలపై ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు ప్రజా సంక్షేమం సామాజిక న్యాయం సమానత్వం కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ ఆర్ఐ వేణు తో పాటు సిబ్బంది పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

**కొండా లక్ష్మణ్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జువ్వాడి కృష్ణారావు**

కోరుట్ల సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తొలిదశ పోరాటంలో తన పదవిని మలిదశ పోరాటంలో తన ఇంటిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో అయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎందరో ఎన్నో పోరాటాలు చేశారని ఆ పోరాటాలకు ముందు వరసలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఉంటారని అలాంటి వ్యక్తి యావత్ తెలంగాణ జాతికి సదా స్మరణీయమని అన్నారు ఆయన చావాలని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు నేటి సమాజంలో త్యాగాలు సమయపాలన అవసరమని అన్నారు నామినేటెడ్ పదవులు పద్మశాలిలకు అవకాశం ఇవ్వాలని కోరగా ఇట్టి విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని తెలిపారు అలాగే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామని చెప్పిన నాయకులు ఎక్కడ అని ప్రశ్నించారు ఎంపీ ధర్మపురి అరవింద్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లు ప్రముఖుల వర్ధంతి జయంతి వేడుకల్లో పాల్గొనకపోవడం చాలా బాధాకరమని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సేవ చేస్తామని నాయకులు కనీసం ప్రముఖుల వర్ధంతి జయంతి వేడుకల్లో పాల్గొనలేకపోవడం ఏంటని ప్రశ్నించారు పోపా ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని స్థానిక పట్టణంలోని పలు కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జువ్వాడి కృష్ణారావు చేతులమీదుగా మెమొంటోలు నగదు బహుమతులను అందజేయగా వారి ప్రతిభను గుర్తించిన కృష్ణారావు శాలువాలతో సన్మానించి అభినందించారు అనంతరం పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేశారు ఈకార్యక్రమాలు పద్మశాలి సంఘం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిర్వహించగా ఇట్టి కార్యక్రమాల్లో జువ్వాడి కృష్ణారావు తో పాటు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం నాయకులు అన్నం అనిల్ కోమిరెడ్డి విజయ్ ఆజాద్ ఎడ్ల రమేష్ ఆదేపు మధు జిందం లక్ష్మీనారాయణ మచ్చ కవిత ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానంద చారి కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి గడ్డం మధు గడ్డం లక్పతి రెడ్డి ఎంబేరి నాగభూషణం ఎంబేరి సత్యనారాయణ చెన్న విశ్వనాథం సుతారి రాములు పాతర్ల విజయ్ షేక్ మహమ్మద్ సోహెల్ కాంగ్రెస్ కమ్యూనిస్ట్ తదితర పార్టీల నాయకులు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జువ్వాడి కృష్ణారావు**

మెట్ పల్లి సెప్టెంబర్ 27 (వుదయం ప్రతినిధి)



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా మెట్పల్లి పట్టణంలోని జాతీయ రహదారి63 పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు విచ్చేసి ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు జెటి లక్ష్మణ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్ సదానంద చారి మల్లాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు గడ్డం లక్పతి రెడ్డి అంజి రెడ్డి గడ్డం లింగారెడ్డి భూమాచారి అందె మారుతి షేక్ మహ్మద్ సోహెల్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకుడలు కార్యకర్తలు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# మురికి కాలువల శుభ్రతకు ప్రత్యేక చర్యలు

**పారిశుద్ధ్యమే ప్రజారోగ్యానికి పునాది: సర్పంచ్ తిరుమల కుమార్**

ముత్తారం సెప్టెంబర్ 27(వుదయం ప్రతినిధి):

మండలంలోని కేశన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పేగడ తిరుమల కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మురికి కాలువల శుభ్రపరిచే పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుమల కుమార్ మాట్లాడుతూ,గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులను నిరంతరం చేపడుతున్నామని తెలిపారు.మురికి కాలువలు, చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. అందుకే కాలువల శుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.గ్రామస్తులు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ సూచనలను పాటించాలని కోరారు.



గ్రామ పరిశుభ్రత కోసం చేపడుతున్న చర్యలను స్థానికులు అభినందించారు.